RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 274 మేడ్చల్ మల్కాజ్‌గిరి 26 అక్టోబర్ 2024 శనివారం పేజీలు : 4

## డ్రైవర్ రహిత మెట్రో రైల్ ట్రయల్ రన్

చెన్నై: చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టులో భాగంగా డ్రైవర్ రహిత మెట్రో రైళ్ళను నగరంలో నడుపనున్నారు. ఇందులో భాగంగా, మెట్రో రైల్ అధికారులు ఈ నెల 26న తొలి డ్రైవర్ రహిత మెట్రో రైల్ టెస్ట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. పూందమల్లిలోని టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్‌లో ఈ రైళ్ళను పరీక్షిస్తారు. చెన్నై నగరంలో ప్రజా రవాణా సులభతరం చేసే చర్యల్లో భాగంగా మెట్రో రైల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇపుడు రెండో దశ ని ర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.63,246 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టును మాధవరం మిల్క్ కాలనీ - సిరుచ్చేరి, లైట్ హౌస్ నుంచి పూందమల్లి, మాధవరం నుంచి షోలింగనల్లూరువరకు మూడు మార్గాల్లో నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి.



## జీవన్‌రెడ్డి ఆవేదన చూసి చాలా బాధ అనిపించింది

హైదరాబాద్: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆవేదనతో కాంగ్రెస్ అగ్రనేతలకు లేఖలు రాయడం, మీడియాలో ఆవేదన వ్యక్తం చేయడంపై మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తీవ్రంగా స్పందించారు. జీవన్‌రెడ్డి ఒంటరి కాదు.. సమయం వచ్చినప్పుడు జగ్గారెడ్డి అండగా ఉంటారని స్పష్టం చేశారు. జీవన్‌రెడ్డి రాజకీయ జీవితం అంతా కాంగ్రెస్‌లోనే కొనసాగిందని, ఆయనకు అడుగడుగునా కష్టాలు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిన్న జీవన్‌రెడ్డి ఆవేదన మీడియాలో చూసిన తర్వాత చాలా బాధ అనిపించిందిన్నారు. ఏం జరుగుతుందో తనకు అర్థం కావడం లేదని, ఏం మాట్లాడాలో తెలియడం లేదని.. అందుకే ఏమీ మాట్లాడలేకపోతున్నానని పేర్కొన్నారు. ఈ వయసులో కూడా ఆయనకు ఈ ఆవేదన ఏంటి అని మనసుకు బాధ కలిగిందన్నారు. జీవన్ రెడ్డికి...ఈ మాత్రమైనా జగ్గారెడ్డి అండగా ఉన్నాడని చెప్పడానికే తన మనసులో మాటని మీడియా ద్వారా తెలియజేస్తున్నట్లు చెప్పారు. తాను ఎవరినీ తప్పుపట్టడం లేదని.. జీవన్‌రెడ్డి ఒంటరి అని అనుకోవద్దని పేర్కొన్నారు. ఎప్పుడూ జనంలో ఉండే జీవన్ రెడ్డిని జగిత్యాల ప్రజలు, సంగారెడ్డిలో తనను ఎందుకు ఓడించారో అర్థం కావడం లేదన్నారు. జీవన్‌రెడ్డి సమస్యను అధిష్టానం గుర్తించి పరిష్కారం చూపాలని కోరుతున్నట్లు తెలిపారు.




## మా బాధలను అర్థం చేసుకోండి.. సచివాలయాన్ని ముట్టడించిన బెటాలియన్ పోలీస్ కుటుంబాలు

హైదరాబాద్: గత కొన్నిరోజులుగా జిల్లాల్లో కొనసాగుతున్న బెటాలియన్ పోలీస్ కుటుంబాల ఆందోళనలు హైదరాబాద్‌కు వ్యాపించాయి. బెటాలియన్ పోలీస్ కుంటుంబాల సభ్యులు సచివాలయ ముట్టడికి యత్నించారు. సెక్రటేరియట్ ముందు బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఒకే దగ్గర విధులు నిర్వర్తించేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మొండి వైఖరితో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఏక్ పోలీస్ హామీ ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీశారు. తమ కుటుంబ సభ్యుల బాధలను అర్థం చేసుకోవాలన్నారు. కాగా, వారిని అడ్డుకున్న పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

**'ఏక్ పోలీస్' హామీ ఏమైంది..** అందరి పోలీసుల్లాగే తమ భర్తలు కూడా పరీక్షలు రాసి, ఫిజికల్ టెస్టుల్లో పాసై, 9 నెలలు కఠోర శిక్షణ తీసుకున్నవారేగా? వాళ్లకెందుకు మిగతా సివిల్, ఏఆర్ పోలీసుల్లాగా ఒకే చోట డ్యూటీలు వేయరు? వాళ్లను కట్టుకున్న పాపానికి మేమేం తప్పు చేశాం? అంటూ బాధిత బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

'మా భర్తలు ఏడాదికి మూడు జిల్లాలు తిరగాల్సి వస్తుంది. మేము ఎక్కడ ఉండాలి? మా బిడ్డలు ఎక్కడ చదువుకోవాలి? చేసేది పోలీసు ఉద్యోగమైనా ఈ తిరుగుడేంది?' అని ప్రశ్నిస్తున్నారు. పోలీసు ఉద్యోగం చేస్తున్న తమ భర్తలను తోటి పోలీసులే జీతగాండ్లలాగా చూస్తున్నారని.. పొద్దున్నే పలుగు, పారలతో గడ్డి పీకిస్తున్నారని కన్నీటి పర్యంతమవుతున్నారు. రాష్ట్రంలో సివిల్, ఏఆర్ పోలీసుల మాదిరిగానే బెటాలియన్ పోలీసులకు వారు కోరుకున్న జిల్లాలో కనీసం 3-5 ఏండ్లు ఒకే చోట పనిచేసే వెసులుబాటు కల్పించాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. దీని వల్ల పిల్లల చదువులకు అంతరాయం లేకుండా ఉంటుందని, ఉద్యోగభారం తగ్గుతుందని చెబుతున్నారు.



## నవంబరు చివరి నాటికి క్రీడా విధానం సిద్ధం కావాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: నవంబరు చివరి నాటికి ఉత్తమ క్రీడా విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అవసరమైతే వివిధ దేశాల క్రీడా విధానాలను అధ్యయనం చేయాలన్నారు. క్రీడా విధానంపై సీఎస్ శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారు కేకే, జితేందర్‌రెడ్డి, శాట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డితో సీఎం సమీక్షించారు. వీలైనంత త్వరగా క్రీడా వర్సిటీ బిల్లును సిద్ధం చేసి.. మరో పది రోజుల్లో గవర్నింగ్ బోర్డును ఫైనల్ చేయాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు క్యాలెండర్ ఉండాలన్నారు.

# అరెస్టులు తప్పవా..!?

## రేవంత్ హిట్ లిస్ట్‌లో ఉన్నదెవరు...!?

## పొంగులేటి వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠ!!



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయంలో కొత్త కలకలం. బీఆర్ఎస్ నేతల పై రేవంత్ సర్కార్ గురి. కీలక నేతల అరెస్ట్ లు ఉంటాయంటూ పొలిటికల్ సర్కిల్స్ లో ప్రచారం.

తాజాగా మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయం కొత్త టర్న్ తీసుకుంది. గత ప్రభుత్వ హాయంలో జరిగిన అక్రమాల పైన పూర్తి ఆధారాలతో బాధ్యుల పైన చర్యలు ఉంటాయని ప్రభుత్వంలోని కీలక నేతలు చెబుతున్నారు. ఇందుకు ముహూర్తం సైతం ఫిక్స్ చేసారు. దీంతో, ఇప్పుడు సీఎం రేవంత్ హిట్ లిస్టులో ఉన్నదెవరు. ఏం జరగబోతోంది.

**అరెస్ట్ లు ఖాయమంటూ...** తెలంగాణలో సంచలన రాజకీయ పరిణామాలు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. బీఆర్ఎస్ ముఖ్యుల అక్రమాలపై ఫైళ్లు సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రభుత్వ లిస్టులో నాటి ప్రభుత్వంలో కీలక నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. నవంబర్ తొలి వారంలో వరుస పరిణామాలు ఉంటాయని ముఖ్య నేతలు లీకులు ఇస్తున్నారు. దీంతో, ప్రస్తుతం గులాబీ పార్టీలో టెన్షన్ మొదలైంది. మంత్రి పొంగులేటి త్వరలోనే బాంబులు పేలతాయంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపుతున్నాయి. అన్నింటికీ పక్కా ఆధారాలున్నాయని, ఎవరినీ వదిలిపెట్టబోమని మంత్రి స్పష్టం చేసారు. దీంతో, గత ప్రభుత్వం పై సీఎం రేవంత్ గతంలో చేసిన ఆరోపణలు.. అంశాల పైన చర్చ మొదలైంది.

**ఈ అంశాలపైనే ఫోకస్..** గత ప్రభుత్వంలో అనేక అక్రమాలు జరిగాయన్నారు. ఫోన్‌ట్యాపింగ్, ధరణి, భూ అక్రమాల పైన కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున ఆరోపణలు చేసారు. వీటిలో కుంభకోణాలు జరిగాయని రేవంత్ తో సహా పార్టీ నేతలు ఆరోపించారు. దీనికి సంబంధించి అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తి సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. అక్రమార్కులను ఎలా శిక్షించాలన్నది చట్టం చూసుకుంటుందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. కుంభకోణాలు, అవినీతిలోని ఆస్తుల రికవరీని కూడా చట్టమే చూసుకుంటుందని చెప్పుకొచ్చారు. దీంతో, కాంగ్రెస్ ఆరోపణలు చేసిన అంశాల్లో ఎవరి పాత్ర ఉంది.. పొంగులేటి చెప్పిన మాటల్లో వాస్తవం ఎంత అనేది బీఆర్ఎస్ నేతలు ఆరా తీస్తున్నారు.

**పెరుగుతున్న ఉత్కంఠ..** చట్టాలు ఉల్లంఘించి చేసిన పనుల రికార్డులను సిద్ధం చేశామని.. రెండు రోజుల్లో ఏం జరుగుతుందో మీరే చూస్తారని మంత్రి మరింత ఉత్కంఠ పెంచారు. ఎవరూ తప్పించుకోకుండా పక్కా ఆధారాలతో ముందుకెళ్తున్నామని వెల్లడించారు. ధరణి-భూముల అక్రమాలకు సంబంధించిన అంశాలనే వెలుగులోకి తెచ్చి కేసులు పెడతారని చెబుతున్నారు. ధరణి వ్యవహారాలను ఒక ప్రైవేటు సంస్థ టెరాసిస్‌కు ఇచ్చి, దాన్ని అడ్డు పెట్టుకుని కూడా కొన్ని లావాదేవీలు అక్రమంగా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో, ప్రభుత్వం నుంచి తీసుకునే నిర్ణయాల పైన బీఆర్ఎస్ క్యాంపులో ఉత్కంఠ పెంచుతోంది.




# కరెంటు చార్జీల పెంపును అడ్డుకుంటాం..

## విద్యుత్ సంస్థల కోసం చేసే ఖర్చు భారం కాదు : కేటీఆర్

హైదరాబాద్: విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గత పదేండ్లు స్వర్ణయుగంలా నడించిందని, ఈ పది నెలల నుంచి దినమొక యుగంలా ఉందని చెప్పారు. తమ హయాంలో రైతులపై రూపాయి భారం పడలేదని తెలిపారు. అన్నదాతలకు ఉచితంగా విద్యుత్ అందించామని వెల్లడించారు. విద్యుత్ చార్జీల పెంపు, ఆదాయ ఆవశ్యకతపై సిరిసిల్లలో తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా కేటీఆర్ తమ వాదన వినిపిస్తూ.. ప్రజలపై కరెంటు భారం మోపడం సరికాదన్నారు. సిరిసిల్ల నేతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలని చెప్పారు. విద్యుత్ చార్జీలను 5 రెట్లు పెంచే ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. అన్నిరకాల పరిశ్రమలకు ఇచ్చే విద్యుత్‌ను ఒకే గాటున కట్టడం కరికాదని చెప్పారు. చార్జీల పెంపుతో కుటీర పరిశ్రమలపై భారం పడుతుందన్నారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. అన్ని ఇండస్ట్రీలను కాపాడుకుంటేనే మనుగడ ఉంటుందని చెప్పారు. ఉచిత విద్యుత్ భారాన్ని మధ్యతరగతి, చిన్న పరిశ్రమలు, భారీ పరిశ్రమల పై వెయ్యాలని ఆలోచించడం సమంజసం కాదని చెప్పారు. బాధ్యతగల ఈఆర్‌సీ ఈ విషయంలో ప్రజలు, రాష్ట్ర సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోవాలన్నారు. కరెంటు చార్జీలు పెంచాలి అనే ప్రభుత్వ ప్రతిపాదనను తిరస్కరించాలన్నారు. ఉచిత విద్యుత్ పేరుతో ఉన్న విద్యుత్‌ను ఊడగొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. పది నెలల్లో ఒక వైపు కరెంటు కోతలు.. మరోవైపు చార్జీల మోతలని విమర్శించారు.

చార్జీల పెంపును అడ్డుకుంటామని, ప్రజా పోరాటానికి వెనుకాడమన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల నడ్డి విరిచేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నదని విమర్శించారు. అదానీ, అంబానీలకు.. సిరిసిల్ల నేతన్నలకు ఒకే కేటగిరి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. గత పదేండ్లలో ఆత్మహత్యలు లేవు, కానీ 10 నెల్లలోనే 10 మంది చనిపోయారన్నారు. సీఎం రేవంత్ బుద్ధి మార్చుకోవాలని హితవు పలికారు. దీపావళికి ముందే బాంబులు పెళుతాయన్న మంత్రి పొంగులేటి కామెంట్స్‌పై స్పందించిన కేటీఆర్.. అయన పై జరిగిన ఈడి రైట్స్ కావచ్చని ఎద్దేవా చేశారు. ఎం చేస్తారో చేసుకోండని చెప్పారు. ఈ చిట్టి నాయుడు ఏం చేస్తాడని, చిల్లర కేసు పెట్టి జైలుకి పంపిస్తారు కావచ్చు అంతే అన్నారు. నిజమైన బాంబులకే భయపడలేదు, గీ సుతిల్ బాంబులకు భయపడతానా అని చెప్పారు. జగిత్యాల ఎంఎల్‌ఏ సంజయ్‌పై ఫైరయ్యారు. ఆయనో రాజకీయ వ్యభిచారని విమర్శించారు. జగిత్యాలలో కాంగ్రెస్ నాయకులే ఒకరినొకరు చంపుకుంటున్నారని చెప్పారు. ప్రధాని మోదీ నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన నాడు మనం తీవ్రమైన విద్యుత్ కొరతతో ఉన్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పారిశ్రామికవేత్తలు పవర్ హాలిడేస్ వద్దని ఇందిర పార్క్ వద్ద ధర్నాలకు దిగిన పరిస్థితి ఉండేదని.. మరోవైపు రైతులు కరెంట్ లేక తీవ్ర నిరాశలో ఉన్న పరిస్థితి ఉందని గుర్తు చేశారు. సిరిసిల్లలో కూడా పవర్ లూమ్ పరిశ్రమ కరెంట్‌తోనే ముడిపడి ఉందన్నారు. ఇక్కడ కూడా కరెంట్ లేక ఎంతో మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించి ప్రతి మనిషికి విద్యుత్‌తో విడదీయరాని సంబంధం ఉందని తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు సంబంధించి ఈఆర్సీ సిరిసిల్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొన్నారు.

# సంపాదకీయం

## అమెరికా ఎన్నికల్లో ఆ నాలుగు జాతులూ ఎవరు.... ఎటువైపు?

అమెరికా అధ్యక్ష ఎన్నికల సందడి ఆ దేశానికే పరిమితం కాదనే సంగతి తెలిసిందే. ఇక్కడ అనేక దేశాల నుంచి వలసవచ్చి స్థిరపడిన పెద్ద పెద్ద సమూహాలు ఉంటాయి. ఈ జాతులు అగ్రరాజ్య అధ్యక్ష ఎన్నికల్లో కీలక భూమిక పోషిస్తుంటాయి. ఈ క్రమంలో... ఆసియా దేశాల వారూ ఇక్కడ తురుపుముక్కలనే కామెంట్లు వినిపిస్తుంటాయి. వారి పాత్ర అత్యంత కీలకం! అవును.. వలస రాజ్యంగా పేరొందిన అగ్రారాజ్యంలో ప్రధానంగా నాలుగు జాతులు ఎన్నికలను ప్రభావితం చేస్తుంటాయి. వాస్తవానికి ఇక్కడ శ్వేత జాతీయులే ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఆఫ్రో అమెరికన్లు, స్పానిష్ మాట్లాడే హిస్పాన్నియన్లు, ఏషియన్లు కీలక భూమిక పోషిస్తుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే వీళ్లే డిసైడింగ్ ఫ్యాక్టర్ అని అంటుంటారు! వీరిలో ప్రధానంగా అధిక సంఖ్యలో ఉండేది మాత్రం శ్వేత జాతీయులే. అగ్రరాజ్యం జనాభాలో సుమారు 59 శాతం ఉండే వీరిలో అత్యధికులు రిపబ్లికన్స్ వైపే ఉంటుంటారు. అమెరికా గ్రామీణ ప్రాంతాల్లో వీరి సంఖ్య అధికంగా ఉంటుంది. "మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్" అంటూ ట్రంప్ స్టాండ్ తీసుకోవడంతో ఈసారి ఈ శ్వేత జాతీయుల ఓట్లు మరింతగా రిపబ్లికన్స్ కే పడతాయని భావిస్తున్నారు. అమెరికాలో ఉన్న రెండో అత్యధిక జనాభా ఉన్న జాతి.. హిస్పానియన్లు. వీరు లాటిన్ అమెరికా దేశాల నుంచి వచ్చి స్థిరపడ్డారు. వీరు ఎక్కువగా స్పానిష్ మాట్లాడతారు. అమెరికా జనాభాలో వైట్స్ తర్వాత అధిక సంఖ్యాకులు (19.1 శాతం) వీరే. దీంతో... వీరి ఓట్లు అత్యంత కీలకంగా ఉంటాయి. డెమోక్రట్ పార్టీ ఓట్లలో సుమారు 12 శాతం వీరివే ఉంటాయని చెబుతుంటారు. ఇక వీరిద్దరి తర్వాత అధిక సంఖ్యలో ఉండేది ఆఫ్రో అమెరికన్లు. శతాబ్ధాల కిందట ఆఫ్రికా నుంచి బానిసలుగా వచ్చి ఇక్కడే స్థిరపడ్డ వారి వారసులైన వీరు ఇప్పటికీ జాతి వివక్షపై ఆందోళన చేస్తుంటారు. దేశ జనాభాలో వీరివాటా 12.6 శాతం కాగా.. వీరు డెమోక్రాట్లకు భారీగా మద్దతు ఇస్తారు. డెమోక్రాట్ ఓటర్లలో 17% వీరే ఉంటారు. ఇక, ఈ జాబితాలో లాస్ట్ బట్ నాట్ లీస్ట్ అన్నట్లుగా ఆసియా దేశాల నుంచి వచ్చి స్థిరపడిన ఆసియన్లు ఉంటారు. వీరు ఎక్కువగా డెమోక్రాట్లకు మద్దతు తెలుపుతుంటారు. 2022 ఎన్నికల్లో 68శాతం ఆసియన్లు డెమోక్రాట్లకు ఓటు చేసినట్లు చెబుతారు. అంచనాలకు అందదు అని చెప్పే వీరి ఆలోచన ఇప్పుడు ఎవరి వైపు ఉందనేది ఆసక్తిగా మారింది!

## శామీరు పేట పోలీస్ స్టేషన్ పనితీరును పరిశీలించిన మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి










శామీర్ పేట, (గరుడ వార్త) : శామీర్ పేట పోలీస్ స్టేషన్ పనితీరును మేడ్చల్ జోన్ డిసిపి కోటిరెడ్డి పరిశీలించారు. శుక్రవారం మేడ్చల్ డిసిపి శామీర్ పేట పోలీస్ స్టేషన్ ను విచ్చేసి రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ భవణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పెట్రోల్ కార్లు, వాటి పరికరాలను పరిశీలించారు. పీఎస్‌ల పూర్తి రికార్డులను జనరల్ డెయిరీ, రిసెప్షన్ రిజిస్టర్‌లు, అనుమానిత షీట్‌లు, రౌడీ షీట్‌లు, ల్యాండ్ గ్రాబింగ్ షీట్‌లు తనిఖీ నిర్వహించారు. ఇన్వెస్టిగేషన్ అధికారుల కేసు ఫైళ్లను పరిశీలించారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈ మధ్యన జరిగిన రాబరీ, డెకాయిటీ, దొంగతనం కేసులలో శామీర్ పేట పోలీస్ లు చేసిన ఇన్వెస్టిగేషన్ విధానం, వారిని తొందరగా పట్టుకున్న విధానం. బాధితులకు త్వరగా న్యాయం చేసిన విధానం పై డీసీపీచాకచక్యంగా పని చేసిన సిబ్బందికి రివార్డ్స్ అందించారు.

ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సైలను పోలీస్ సిబ్బందిని డిసిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో పెట్ బషీరాబాద్ ఏసిపి రాములు, శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం మెరవాలి.. పల్లెలు మురవాలి!

కరీంనగర్ : పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. పంచాయతీల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలను ఈనెల 17 నుంచి నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ కాగా సిబ్బందితో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. అక్టోబరు 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని గతేడాది భారత ప్రధాని నరేంద్రమోదీ స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది 18 రోజులపాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మెరుగైన పారిశుద్ధ్యంతో స్వచ్ఛగ్రామాలుగా మార్చాలని భావిస్తున్నారు. పారదర్శకతతో పూర్తి స్థాయిలో ముందుకెళ్తేనే జిల్లాలో పారిశుద్ధ్య పనులు మెరుగుపడి అనుకున్న లక్ష్యం నెరవేరనుంది.

నామమాత్రం పనులు కాకుండా..

స్వచ్ఛతాహీ సేవలో ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలు సంపూర్ణంగా అమలు చేయాలి. కానీ అక్కడక్కడ కేవలం రహదారులపై చెత్తను ఊడ్చి, కాలువలో మురుగు తొలగింపు వంటి నిత్యం చేసే కార్యక్రమాలనే నిర్వహించి మమ అనిపించారనే ఆరోపణలున్నాయి.

ప్రారంభ రోజుల్లో హడావుడి చేసి.. తర్వాత వదిలేస్తున్నారని.. ఎక్కడ పారిశుద్ధ్య పనులు వంద శాతం పారదర్శకంగా జరగటం లేదనేది పల్లె జనాల మాట. సెగ్రిగేషన్ షెడ్లలో చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న పంచాయతీలను వేళ్లపైన లెక్కించవచ్చు. నిత్యం వినియోగిస్తున్న ప్లాస్టిక్, చెత్త అక్కడక్కడా రోడ్లపైన దర్శనమిస్తోంది. పైగా పక్షం రోజులు జరిగే స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమానికి ప్రత్యేకించి నిధులు వెచ్చించకపోవటం, నిత్యం చేసే పనేగా అనే నిర్లక్ష్యం ప్రతికూల అంశంగా చెప్పవచ్చు.

రాష్ట్ర స్థాయి పురస్కారాలు..

గతేడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తిమ్మాపూర్, రామడుగు మండలం వెలిచాల, గన్నేరువరం మండలం కాసింపేట గ్రామాలు జిల్లాలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికై, రాష్ట్ర స్థాయి ఉత్తమ పంచాయతీలుగా పురస్కారాలు అందుకున్నాయి. జాతీయ స్థాయిలో రాణించలేకపోయాయి.

చేపట్టే కార్యక్రమాలు..

పంచాయతీ పాలకవర్గాలు, మండల ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు శ్రమదానంతో పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టడం.

ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించి కంపోస్ట్‌షెడ్లలో తడి, పొడి చెత్తను వేరు చేయడం.

ఒకసారి వినియోగించిన ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని అక్టోబరు 2న గ్రామ సభల్లో తీర్మానాలు చేయడం.

స్వచ్ఛత ప్రాధాన్యంపై విద్యాలయాల్లో, క్విజ్ పోటీల నిర్వహణ, విద్యార్థులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడం.

తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారు చేయటం.

గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, ప్రజోపయోగ స్థలాలు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చెత్త, మురుగు తొలగింపు.

పర్యాటక ప్రదేశాల్లో సంపూర్ణంగా ప్లాస్టిక్ నిషేధం జరిగేలా చర్యలు.

పంచాయతీల ఆధ్వర్యంలో మొక్కల సంరక్షణ.

గ్రామస్థులు వస్త్ర సంచులు వినియోగించేలా అవగాహన కల్పించడం.

## ఆయుష్ పోయిండి!



గోదావరిఖని : జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికపల్లి హోమియో ఆసుపత్రిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు వినయకుమారి. ఈ కేంద్రం నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేయడంతో గ్రామీణ ప్రాంతంలో హోమియో వైద్యంపై అవగాహన పెరిగి చుట్టుపక్కల గ్రామాల వారు వినియోగించుకుంటున్నారు. రోజు సుమారు 30 మంది రోగులు సేవలు పొందుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఎక్కువగా వస్తారని వైద్యురాలు చెప్పారు. ఆరోగ్య ఉపకేంద్రం కోసం నిర్మించిన ఇరుకు భవనం కావడంతో కార్యకలాపాలకు ఇబ్బందిగా ఉంది. తిమ్మాపూర్‌లోని ప్రభుత్వ యునాని వైద్యశాల ఇది. ఇక్కడ పని చేస్తున్న వైద్యురాలు డా. ఫర్హానా ఖాతున్‌కు చిగురుమామిడి మండలం ఇందుర్తి కేంద్రం బాధ్యతలు అదనంగా అప్పగించడంతో అక్కడ మూడు రోజులు, ఇక్కడ మూడు రోజులు సేవలందిస్తున్నారు. తిమ్మాపూర్ పీహెచ్‌సీలోని చిన్న గదిలో ఆయుష్ వైద్యశాల నిర్వహిస్తుండటంతో ఇరుకుగా ఉంది. వైద్యురాలు వచ్చిన రోజుల్లో సగటున 10 మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారు. పక్కా భవనం ఏర్పాటు చేసి వైద్యురాలు పూర్తి స్థాయిలో ఇక్కడే విధులు నిర్వహిస్తే జనం సేవలు ఉపయోగించుకునే అవకాశముంది.

కేంద్ర ప్రభుత్వం సంప్రదాయ వైద్య విధానాలను ప్రోత్సహించాలని నిర్ణయించడంతో ఆయుష్ (ఆయుర్వేద, యోగా, యునాని, సిద్ధ, హోమియో) మిషన్ కింద ఉమ్మడి జిల్లాలో పలు ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో కొన్ని చోట్ల వైద్యుల కొరత వెంటాడుతుండగా.. మరికొన్ని చోట్ల భవనాలు సరిగా లేవు.. దీంతో ఈ వైద్య సేవలను గ్రామీణ ప్రాంతాల్లో జనం పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడం లేదు. చాలా ఏళ్లుగా పని చేస్తున్న కేంద్రాలకు మాత్రం బాధితుల తాకిడి ఉండటం.. అవగాహన కల్పించి సౌకర్యాలు ఏర్పాటు చేస్తే జనం సంప్రదాయ వైద్య విధానాలకు ఆసక్తి చూపిస్తారన్న విషయాన్ని తేటతెల్లం చేస్తోంది..

ఆదరణ తక్కువకు ఇవీ కారణాలు

ఆయుష్ ఆరోగ్య కేంద్రాలపై చాలా మందికి అవగాహన లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా అల్లోపతి వైద్యం కోసం ఉపకేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్తున్నారు తప్పితే ఆయుష్ కేంద్రాల వైపు చూడటం లేదు. దీంతో వైద్యాధికారులు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తున్నా చాలాకాలంగా ఉన్న కేంద్రాలకు రద్దీ అధికంగా ఉండగా, కొత్తగా ఏర్పాటు చేసిన వాటికి లేకపోవడం గమనార్హం.

ఆయుష్ కేంద్రాల్లో వైద్యుల కొరత వెంటాడుతోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే కేంద్రాలతోపాటు ఒప్పంద విధానంలో నిర్వహించే జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం (ఎన్‌ఆర్‌హెచ్‌ఎం) కేంద్రాల్లోనూ పూర్తి స్థాయిలో వైద్యులు లేరు. ఉమ్మడి జిల్లాలో 45 రెగ్యులర్, 32 ఎన్‌ఆర్‌హెచ్‌ఎం కేంద్రాలు ఉండగా 15 కేంద్రాల్లో వైద్యులు లేరు. ఉమ్మడి జిల్లాలో ఆయుష్ కేంద్రాలకు రోజుకు సగటున 1000 మంది వరకు మాత్రమే వచ్చి సేవలు పొందుతున్నారు.

కొన్ని కేంద్రాలకు పక్క జిల్లాల వైద్యులకు అదనపు బాధ్యతలు కేటాయిస్తున్నారు. ఒకే వైద్యుడు రెండు చోట్లా బాధ్యతలు నిర్వహించడం వల్ల ఎక్కడా పూర్తిస్థాయిలో సేవలందించే అవకాశం లేకుండా పోతోంది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించే ఆరోగ్య కేంద్రానికి రోగుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. ఇదే విధంగా మిగతా కేంద్రాల్లో కూడా రోగుల సంఖ్య పెంచుకోవడానికి వైద్యాధికారులు ప్రయత్నిస్తే ఆయుష్ సంకల్పం నెరవేరుతుంది.

అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నాం : ఆయుష్ మిషన్ ద్వారా నిర్వహిస్తున్న ఆరోగ్య కేంద్రాలపై గ్రామీణ ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. కొన్ని కేంద్రాల్లో రోగులు ఎక్కువగానే వస్తున్నారు. అన్ని కేంద్రాల్లో సంఖ్య పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. వైద్యుల కొరత ఉన్న చోట మరో వైద్యుడికి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నాం.

ప్రవీణ్‌కుమార్, ఆయుష్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్, కరీంనగర్ ఋ

## అర్జీలు కనిపించక అయోమయం

కరీంనగర్ : అనధికార ప్లాట్లు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుదారుల్లో గందరగోళం నెలకొంది. వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ముందుగానే వడబోస్తుండటంతో అత్యధిక శాతం అర్జీలు కనిపించడం లేదు. ఇంతకీ ఆ దరఖాస్తులు ఏమైనట్టో ఏ అధికారి చెప్పలేకపోతున్నారు. పూర్తి వివరాలతో కథనం.

నాలుగేళ్ల కిందట వెయ్యితో నమోదు..

జిల్లాలోని పురపాలికలు, నగరపాలక, శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ, గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 68,405 దరఖాస్తులు వచ్చాయి. వీటిని 2020 అక్టోబరు 31 వరకు స్వీకరించారు. ఆ సమయంలో ఎలాంటి పత్రాలు లేకుండానే ఆన్‌లైన్‌లో రూ.వెయ్యి చెల్లించి వివరాలను నమోదు చేసుకున్నారు.

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండగా మళ్లీ వాటిని పరిష్కరించాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. మూడు దశల్లో పరిశీలించేలా వెబ్‌సైట్ ద్వారా, చరవాణి అర్జీలతో అధికారులకు అధికారం ఇచ్చారు. పరిశీలన సమయంలో దరఖాస్తులు ఎక్కువగా కనిపించకపోవడంతో అయోమయం నెలకొంది.

ఒకరు చూస్తే మరొకరికి కనిపించదు

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతంగా పూర్తి చేసేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో క్రమబద్ధీకరణకు వచ్చిన ప్లాట్ల వివరాలను తెలుసుకోవడానికి మూడు దశల్లో అధికారులకు అవకాశమిచ్చారు. ఎల్-1లో పట్టణ ప్రణాళిక అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటి పారుదల శాఖ అధికారులకు.. ఎల్-2లో పట్టణ ప్రణాళిక ఏసీపీ స్థాయి అధికారి, డీటీసీపీ, సీపీవోలు.. ఎల్-3లో కమిషనర్లకు, పంచాయతీ అధికారులకు అనుమతులు ఇవ్వడానికి వీలుంది. ఇందులో ఏ ఒక్క అధికారి దరఖాస్తు తెరిచి చూసినా.. తిరిగి మిగతా అధికారుల లాగిన్‌లో కనిపించడంలేదు.

దరఖాస్తుదారుల ఆగ్రహం

స్థలాలు క్రమబద్ధీకరించుకోవడానికి ముందుకొస్తున్న దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా అర్జీలను సుపరిపాలన కేంద్రం (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్) ముందస్తుగా పరిశీలించి.. వివిధ నిబంధనల ఆధారంగా వడపోస్తుంది.



ఆయా ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయని చరవాణికి సంక్షిప్త సమాచారం వస్తుండటంతో.. అది చూసిన అర్హులైన వారు ఇళ్లు నిర్మించుకున్న చోట నిషేధిత జాబితా ప్లాటు ఉండటం ఏంటని ఆందోళన చెందుతున్నారు.

సర్వే నంబర్ మీద ఎక్కడో ఇబ్బందులుంటే అందరిపై వర్తింపజేయడంపై దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరంగా ఎల్‌ఆర్‌ఎస్ కావాలంటే ఏం చేయాలో తోచక గందరగోళానికి గురవుతున్నారు.

వెంటనే చర్యలు తీసుకోవాలి

క్రమబద్ధీకరణకు ముందుకొస్తే దరఖాస్తులే కనిపించడం లేదంటున్నారు. సులువుగా త్వరగా పరిష్కరించాల్సింది పోయి లేనిపోని సమస్యలు కారణంగా చూపుతున్నారు. ఎంతో మంది కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి.
అశోక్, కరీంనగర్

ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం

ఎల్‌ఆర్‌ఎస్‌లో వస్తున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్రస్థాయిలో చేరవేసి పరిష్కరిస్తున్నాం. నిషేధిత జాబితాలో ఉన్న వాటిని కనిపించకుండా పెట్టారు. ఇవన్నీ పూర్తయిన తర్వాత ఉన్నతాధికారులు పరిశీలిస్తారు. ఎ. ఆంజనేయులు, నోడల్ అధికారి, కరీంనగర్

## హక్కు దక్కక ఆందోళన

జహీరాబాద్: జహీరాబాద్ మండలం సత్వార్‌కు చెందిన దేశ్‌ముఖ్‌కు గ్రామంలోని 429, 430, 471 సర్వే నంబర్లలో 40 ఎకరాల భూమి ఉంది. ఆయన మరణించడంతో ఆ భూమిని ముగ్గురు కుమారుల పేర్లపైకి మార్చారు. 2018లో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన పాసు పుస్తకాలు వారికి ఇవ్వకపోగా.. మీ భూమి వక్ఫ్ పరిధిలో ఉందని అధికారులు సమాధానమిచ్చారు. పాసు పుస్తకాలు లేకపోవడంతో రైతులకు ప్రభుత్వ నుంచి ఎలాంటి ఆర్థికసాయం అందడం లేదు. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిపై హక్కులు దక్కక ఆందోళన చెందుతున్నారు. ఇది ఈ ఒక్క రైతు సమస్య మాత్రమే కాదు. 2001లో వక్ఫ్ బోర్డు విడుదల చేసిన గెజిట్‌తో జహీరాబాద్ డివిజన్‌లోని 2,500 మంది రైతులను ఈ సమస్య వెంటాడుతోంది.

ఇదీ సమస్య

1954, 1995 సంవత్సరాల్లో అమలులోకి వచ్చిన వక్ఫ్ చట్టాలను ఆసరాగా చేసుకొని జహీరాబాద్ నియోజకవర్గంలోని 12,892 ఎకరాల భూములు తమవిగా పేర్కొంటూ వక్ఫ్‌బోర్డు 2001లో ఓ గెజిట్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం జహీరాబాద్ డివిజన్‌లో 2,500 మంది రైతులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కోల్పోయారు. భూములు నిషేధిత జాబితాలో చేరడంతో భూముల అమ్మకాలు, కొనుగోళ్లకు వీలులేదు. రైతు బంధు, రైతు బీమా తదితరాలు వర్తించవు. బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. ఉత్పత్తులను అమ్ముకోవడానికీ రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆందోళన బాట పట్టిన కర్షకులు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నారు.

పాస్ పుస్తకాలు ఇవ్వలేదు
- మల్లేశం, ఖాశీంపూర్


వారసత్వంగా సంక్రమించిన 3 ఎకరాలను వక్ఫ్ భూమిగా పేర్కొంటు 2018 నుంచి నిషేధం విధించారు. పాస్‌పుస్తకాలు ఇవ్వలేదు. బ్యాంకులు రుణం ఇవ్వడం లేదు. రైతుబంధు నిలిచి పోయింది. న్యాయం చేయాలని ఐదేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. సాగుదారులుగానే మిగిలాం..- లక్ష్మీబాయి, సత్వార్ గ్రామం పూర్వీకుల నుంచి సంక్రమించిన 10 ఎకరాలపై నిషేధం విధించడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నాం. భూమిపై ఎలాంటి హక్కులేక పోవడంతో కేవలం సాగుదారులుగానే మిగిలాం. ప్రభుత్వాలు చొరవ చూపి నిషేధం ఎత్తివేసి, పాసు పుస్తకాలు ఇవ్వాలి.

# సాగునీటి సమస్యలకు చెక్!

ధర్మపురి: ఏళ్ల తరబడి సాగునీటి రంగంలో క్షేత్రస్థాయి సిబ్బంది లేక చివరి ఆయకట్టుకు నీరందించడం గగనంగా మారింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెట్టాలని భావిస్తోంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన ప్రకటనతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఓ వైపు జిల్లాలో గోదావరి ఎత్తిపోతల పథకాలు, రోళ్లవాగు ప్రాజెక్టు, అక్కపల్లి చెరువు రిజర్వాయర్, బోలిచెరువు, జంగనాల ప్రాజెక్టు, యశ్వంతరావుపేట ప్రాజెక్టు లాంటివి ఉండటం.. మరోవైపు డీ–53, డీ–86 ప్రధాన కాలువలు ఉన్నాయి. వీటి కింద లక్ష ఎకరాల వరకు ఆయకట్టు ఉంది.

**పిచ్చి మొక్కలతో కాలువలు**

కాలువల ద్వారా నీటిని వదిలిన సమయంలో అవి పూడికతో, పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో ఏటా చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. గోదావరి ఎత్తిపోతల పథకాలు నూతనంగా నిర్మించడంతో వీటి కింద 20 వేల ఆయకట్టు పెరిగింది. ఈ పథకాలకు క్షేత్రస్థాయి సహాయ సిబ్బంది లేక నిర్వహణకు తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. గోదావరికి వరదలు వచ్చినప్పుడల్లా రైతులు సమిష్టిగా పథకాలను బాగు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నూతన నియామక ప్రక్రియ రైతులకు దోహద పడనుంది.



**120 మందితో ప్రతిపాదనలు**

గోదావరి ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లకు ఎంతమంది ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు, పంపు మెకానిక్‌లు అవసరమో ప్రతిపాదించాలని ప్రభుత్వం ఇటీవల ఇరిగేషన్ అధికారులకు లేఖలు ఆ శాఖ ప్రధాన కార్యదర్శి ద్వారా పంపించింది. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలన చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో అన్ని పథకాలకు 120 మంది వరకు అవసరం ఉంటారని నివేదించారు.

**ప్రకటనతో అన్నదాతల హర్షం**

ప్రభుత్వం 22 జులై 2016న నీటిపారుదల శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకుంటే ప్రధాన కాలువపై ప్రతి 9 కి.మీ.కి ఒకరు, ఉప కాలువపై ప్రతి 112 కి.మీల వరకు మరొకరు, డిస్ట్రిబ్యూటర్‌పై ప్రతి 2,500 ఎకరాల ఆయకట్టుకు లస్కర్లు ఉండాల్సి ఉండగా అమలు కావడం లేదు. ఈ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన ప్రకటన, ప్రభుత్వ ప్రతిపాదనలను కోరడం నీటి పారుదల నిర్వహణలో నెలకొన్న దశాబ్దాల సమస్యలు పరిష్కారం వుతాయని భావిస్తున్నారు.

**ఆదేశాలకు అనుగుణంగా చర్యలు**

సాగునీటి రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు వేస్తుంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కొత్తగా లస్కర్లు, సహాయకుల నియామక ప్రక్రియకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించాం. వీటిని నియమిస్తే సాగునీటి సరఫరా సమస్యలు చాలా వరకు తగ్గే అవకాశముంది.
నారాయణరెడ్డి, ఇరిగేషన్ డీఈ, ధర్మపురి డివిజన్

# పేరుకుపోతున్న వడ్డీ బకాయిలు

మెదక్ : రుణాలకు చెల్లించిన వడ్డీ తిరిగి సంఘాలకు జమ కాకపోవడంతో మహిళా సంఘాలు వడ్డీ భారం మోస్తున్నారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేకుండా రుణాలను అందిస్తున్నామని వడ్డీ ప్రభుత్వమే భరిస్తుందని అధికారులు చెబుతున్నారు. సకాలంలో అందడం లేదు. సభ్యులకు ఏటా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కింద నిర్దేశించిన లక్ష్యం మేరకు రుణాల పంపిణీ జరుగుతోంది. రుణాలు పొందిన మహిళా సభ్యులు నెలనెల రుణ వాయిదాలు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేయాల్సిన వడ్డీ డబ్బులు తమ ఖాతాల్లో ఎప్పుడు జమవుతాయని ఎదురుచూస్తున్నారు. జిల్లాలో రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోతున్నాయి.



**రూ.కోట్లలో పేరుకుపోయి..**

రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వడ్డీ రాయితీ నిధులు విడుదల కాకపోవడం మహిళలపై ప్రభావం చూపుతోంది. దీంతో బ్యాంకు లింకేజీ ద్వారా అప్పు తీసుకోవాలంటేనే వెనకడుగు వేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024 మార్చిలో వడ్డీ రాయితీ నిధులను విడుదల చేసింది. కానీ 2023 డిసెంబర్ నుంచి 2024 ఫిబ్రవరి వరకు మూడు నెలలకు సంబంధించి మాత్రమే నిధులను విడుదల చేసింది. ఇందులో మెదక్ జిల్లాలోని 7,953 సంఘాలకు కేవలం రూ.8.92 కోట్ల నిధులు మాత్రమే విడుదలయ్యాయి. మళ్లీ ఇప్పటి వరకు ఎలాంటి వడ్డీ నిధులు విడుదల కాలేదు. 2020 నుంచి జమ కాక.. మహిళలకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటి వరకు గత ఐదేళ్లలో రూ.116.89 కోట్ల వడ్డీ రాయితీ విడుదల కావాల్సి ఉంది. నిధులను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

# ఫ్రాంకింగ్‌కు పాతర




మూసాపేట : సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయల్లో 'ఫ్రాంకింగ్' సేవలకు పాతర వేసినట్లు పరిశీలనలో వెల్లడైంది. రూ.లక్షల విలువైన యంత్రాలను అటకెక్కించారు. దీంతో ప్రైవేటు వ్యక్తులు సొమ్ము చేసుకుంటున్నారు. అత్యవసర, స్టాంపు పేపర్లు లేని సమయాల్లో.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పెద్దఎత్తున భూ, ఆర్థిక లావాదేవీలు జరుగుతుంటాయి. ఏ ఒప్పందాలు చేసుకోవడానికైనా నాన్ జ్యుడీషియల్ రూ.10, 20, 50, 100 స్టాంపు పేపర్లు ఉండాలి. అవి లేని సందర్భాల్లో, అత్యవసర సమయాల్లో తెల్లకాగితాలపై రాసుకున్న ఒప్పందాలకు 'ఫ్రాంకింగ్' చేసుకుంటేనే చట్టబద్ధత కలుగుతుంది. అందుకు బ్యాంకు చలానా ఇస్తే, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది ఎర్రని రంగుతో 'రాజముద్ర' తరహా చిహ్నాన్ని పత్రాలపై ముద్రించి ఇస్తారు. అలా స్థిర, చరాస్తులకూ రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. మార్ట్‌గేజ్ డీడ్, బ్యాంకు లాకర్స్‌కు అవసరమైన ధ్రువపత్రాలకు, ఇండెమ్నిటీ బాండ్, ఎల్‌ఐసీ బాండ్ అవసరాలకు సైతం ఫ్రాంకింగ్‌ను వినియోగిస్తున్నారు. రూ.2 వేలలోపైతే 'టీ యాప్ ఫోలియో' ద్వారా అంతకుమించిన మొత్తమైతే ఎస్‌బీఐ చలానా చెల్లించి రసీదుతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తే నిమిషాల వ్యవధిలోనే ఫ్రాంకింగ్ చేయాలి. కానీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది దీనికి తూట్లు పొడుస్తున్నారు.


**అవగాహన ఉన్నవారు ఒత్తిడి తెస్తే..**

ఫాంకింగ్‌పై అవగాహన ఉన్నవారు నేరుగా కార్యాలయానికి వెళ్లి సిబ్బందిపై ఒత్తిడి తేస్తే అప్పటికప్పుడు యంత్రాలను తీసి సేవలు అందిస్తున్నారు. ఈ దృశ్యం కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కన్పించింది. మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో యంత్రం పాడైందని.. మరమ్మతులకు చెన్నై సంస్థకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. రాజేంద్రనగర్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అటకెక్కించారు.

**జరుగుతున్న తంతు ఇది..**

గ్రేటర్‌లోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫ్రాంకింగ్ యంత్రాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఈ యంత్రాల నిర్వహణ బాధ్యతను 'పిట్నీ బోవ్స్' సంస్థకు అప్పగించారు. ఇవి మరమ్మతులు కావడం అరుదు. కానీ, రకరకాల కారణాలతో సిబ్బంది అటకెక్కించారు. సిబ్బంది లేరని, పనిచేయడం లేదని, ఇంకు అయిపోయిందని సాకులు చెబుతున్నారు. మరికొన్ని కార్యాలయాల్లో బయటి వ్యాపారులతో కుమ్మక్కవుతున్నారు. సదరు సేవల కోసం బ్యాంకులకు వెళ్లి చలానాలు చెల్లించినప్పటికీ గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న సదరు వ్యాపారులు వినియోగదారులను దండుకుంటున్నారు.

# చెత్త కష్టాలకు చెక్ పెట్టేలా ..
## నగరం నలువైపులా 4 కేంద్రాలు



సంగారెడ్డి : ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్లుగా.. మహానగరంలో చెత్త సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపబోతోంది. ప్రస్తుతం నగరంలో ఉత్పత్తి అవుతున్న చెత్తను జవహర్‌నగర్‌కు మాత్రమే తరలించడంతో ఈ ప్రాంతంలో తీవ్ర సమస్యలు ఏర్పడుతున్నాయి. దీన్ని అధిగమించేలా, నగరానికి నాలుగు వైపులా చెత్త తరలింపు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడే చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తికేంద్రాల ఏర్పాటుకూ ప్రణాళిక సిద్ధమైంది. అందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఆదేశించారు. ఈ నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యచరణపై పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ బల్దియా అధికారులు, రాంకీ సంస్థ ప్రతినిధులతో చర్చించారు.

సంగారెడ్డి జిల్లా ప్యారానగర్‌లో 150 ఎకరాల భూమిని సేకరించారు. ఇక్కడ చెత్త నిర్వహణతో పాటు 15 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం ఏర్పాటుచేయబోతున్నారు. జవహర్‌నగర్‌లో మ్యానువల్‌గా చెత్త నిర్వహణ చేస్తుండగా ప్యారానగర్‌లో మాత్రం ఆధునిక పద్ధతులను అవలంభించబోతున్నారు. ఒక బంకర్ నిర్మించి నాలుగువైపులా పెద్ద షెడ్డు నిర్మించనున్నారు. బంకర్‌లోనే చెత్తను తడి, పొడి చెత్తగా విభజిస్తామని, దీంతో కాలుష్య సమస్య ఏర్పడదని అధికారులు తెలిపారు. ఈ కేంద్రంలో 1500 టన్నుల పొడి చెత్తను విద్యుదుత్పత్తికి వినియోగించనున్నారు.

చౌటుప్పల్ దగ్గర మల్కాపూర్‌లో మరో కేంద్రాన్ని 100 ఎకరాల్లో ఏర్పాటుచేయనున్నారు. ఇక్కడ కూడా 15 ఎంవీ విద్యుత్తు కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో కూడా 40 ఎకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఇంత తక్కువ స్థలంలో నిర్వహణ కేంద్రం ఏర్పాటు కష్టసాధ్యమని చెబుతున్నారు.

నగరంతో పాటు చుట్టుపక్కల మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రతిరోజూ ఎనిమిది వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తిఅవుతోంది. ఇందులో సగం పొడిగా, మరో సగం తడి చెత్త. మొత్తం చెత్తను కొన్నేళ్లుగా జవహర్‌నగర్‌కు తరలిస్తున్నారు. ఇక్కడ 24 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాన్ని కొన్నాళ్లకిందటే రాంకీ సంస్థ ఏర్పాటుచేసింది. ఇందులో 1400 టన్నుల పొడి చెత్తను వినియోగిస్తున్నారు. మరో 24 ఎంవీ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం నిర్మాణం మార్చికల్లా పూర్తవుతుందని ఈఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. దుండిగల్‌లో మరో విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఇక నగర వ్యాప్తంగా చెత్తను జవహర్‌నగర్‌కు తరలించడం కష్టంగా మారడంతో మరో నాలుగు చోట్ల చెత్త నిర్వహణ, విద్యుత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. బల్దియా అధికారులు ఏడాదిగా సంబంధిత స్థలాల అన్వేషణ చేశారు. పటాన్‌చెరు మార్గం లక్డారం సమీపంలో వంద ఎకరాల్లో ఒక చెత్త నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు. ఇక్కడా 15 ఎంవీ విద్యుత్తు కేంద్రం ఏర్పాటుచేయనున్నారు. దీనికి కూడా 1500 టన్నుల పొడి చెత్త అవసరమవుతుంది.

# అసంపూర్తి వంతెన నిర్మాణానికి అడుగులు

వేములవాడ: గత రెండేళ్లుగా వివిధ కారణాలతో అసంపూర్తిగా నిలిచిపోయిన వేములవాడలోని మూలవాగుపై వంతెన నిర్మాణ పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి. వంతెనకు ఇరువైపులా భూసేకరణకు ప్రభుత్వం నిధులను మంజూరు చేయడంతో అడ్డంకులు తొలగిపోనున్నాయి. ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని మూలవాగుపై రెండు వంతెనల నిర్మాణంతోపాటు ఇరువైపులా సుందరీకరణ పనులు చేపట్టడానికి అప్పటి ప్రభుత్వం 2015 సంవత్సరంలో రూ.28 కోట్ల కోర్‌నెట్ నిధులను మంజూరు చేసింది. ఇందులో వంతెనల నిర్మాణానికి రూ.12 కోట్లను కేటాయించారు. దీంతో పనులు చేపట్టిన గుత్తేదారు మూలవాగుపై పడమర వైపు వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. రెండో వంతెన పనులు మొదలు పెట్టినప్పటికీ భారీ వర్షాలు, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కారణంగా వంతెన నిర్మాణంలో పనులు ఆగుతూ సాగుతూ చివరికి నిలిచిపోయాయి.

**నిర్మాణం ఇలా...**మూలవాగుపై వంతెనల నిర్మాణంతో ఆధ్యాత్మికత ఉట్టి పడేలా డిజైన్ చేశారు. 12 మీటర్ల వెడల్పు, 190 మీటర్ల పొడవుతో రెండు వంతెనల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో పడమర వైపు వంతెన పూర్తయి వినియోగంలోకి రాగా, రెండోది మధ్యలో ఆగిపోయింది. దీంతో పాటు వంతెనకు ఇరువైపులా కూడళ్లను ఆధ్యాత్మికత ఉట్టి పడేలా సుందరీకరణ చేయాల్సి ఉంది. ఇందుకు భూసేకరణ పూర్తి కావాల్సి ఉంది. వంతెన నిర్మాణ ప్రాంతాల్లో భూములు, ఇళ్లు కోల్పోయే వారికి పరిహారం అందించేందుకు రూ.6.96 కోట్లను ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసింది. వంతెన పనులకు మరో రూ.3 కోట్లను మంజూరు చేసింది. దీంతో రెండో వంతెన పనులకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది.

**2018లో పూర్తి చేయాల్సి ఉన్నా...**మూలవాగు వంతెనల నిర్మాణ పనులు 2015 ప్రారంభమైనప్పటికీ ఒప్పందం ప్రకారం 2018 సంవత్సరంలోనే పూర్తి చేయాల్సి ఉంది. మొదటి వంతెన సకాలంలో పూర్తయినప్పటికీ, ఏటా అవాంతరాలు ఏర్పడటంతో రెండోది కాలేదు. ఈ వంతెన మొదలు పెట్టినప్పటి నుంచి భారీ వర్షాలకు మూడేళ్లలో మూడు సార్లు సెంట్రింగ్ పైపులు కొట్టుకుపోయాయి. దీంతో పనులు ఎప్పుడూ సాఫీగా జరిగిన దాఖలాలు లేవు. రెండో స్టాండ్ బీమ్‌ల నిర్మాణ సమయంలో భారీ వర్షాలకు కుంగిపోయింది. ఆ తరవాత రెండు సార్లు భారీ వర్షాలకు సెంట్రింగ్ పైపులు కొట్టుకుపోయి బీమ్‌లు వంగిపోయాయి. ఏటా సెంట్రింగ్ పనులు చేయడం, భారీ వర్షాలకు కొట్టుకుపోవడంతో గుత్తేదారు నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. దీంతో రెండేళ్లుగా పనులు పూర్తిగా ఆగిపోయాయి.



**త్వరలో పూర్తికి చర్యలు**మూలవాగులో నిలిచిపోయిన రెండో వంతెన నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వంతెనకు ఇరువైపులా భూసేకరణకు రూ.6.96 కోట్లను మంజూరు చేయడం జరిగింది. గత ప్రభుత్వం భూసేకరణకు నిధులు కేటాయించకపోవడంతో పనుల్లో జాప్యం జరిగింది. గుత్తేదారును కూడా మార్చాం. టెండరు ప్రక్రియ పూర్తి చేసి త్వరలో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్

# చెంజర్ల గడ్డ..
## ఉద్యోగుల అడ్డా

మానకొండూర్: గతంలో కరవు కాటకాలతో సతమతమైన గ్రామం అది. ప్రస్తుతం గురువులకు నిలయంగా మారింది. తలాపున కాకతీయ కాలువ ప్రవహిస్తున్నా ఆ పల్లెకు చుక్క నీరు అందడం లేదు. సాధారణ కుటుంబాలు కావడంతో చదువుతోనే భవిష్యత్తు బాగుపడుతుందని పెద్దలు తలచారు. ముందుగా ఆరుగురు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. వారి స్ఫూర్తితో అదే ఉద్యోగాన్ని సాధించాలని మరికొంత మంది దృఢ సంకల్పంతో ముందుకు సాగారు. ప్రస్తుతం ఒక తరాన్ని ప్రభావితం చేయగలిగిన గురువులు ఈ ఊరి సొంతం. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 70 మంది ఉపాధ్యాయులు ఆ గ్రామంలో ఉండడం విశేషం.

మానకొండూర్ మండలంలోని చెంజర్ల గ్రామంలో 3,067 మంది జనాభా ఉంది. నీటి సదుపాయం లేకపోవడంతో ఆశించిన మేర వ్యవసాయం సాగలేదు. దీంతో పలు కుటుంబాలు జీవనోపాధి కోసం ముంబయి, బీవండి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఈ క్రమంలోనే తమ భవిష్యత్తుపై ఆందోళన చెందిన స్థానిక యువత.. చదువుపై దృష్టి సారించింది. మొక్కవోని దీక్షతో.. ఉజ్వల భవిష్యత్తుపై ఆశతో..



ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో చదువులు కొనసాగించారు. 2006 డీఎస్సీలో గ్రామం నుంచి ఒక్కసారే ఆరుగురు ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందారు. ఈ పరిణామం గ్రామంలోని పలువురిని ఉపాధ్యాయ వృత్తి వైపు మళ్లించేలా చేసింది. వారి ఆసక్తికి.. స్థానిక ప్రైవేట్ ఉపాధ్యాయుడు ఆంజనేయులు, మార్కండేయ, శ్రీనివాస్‌ల ప్రోత్సాహం తోడైంది. వారు ఇచ్చిన సూచనలను సద్వినియోగం చేసుకున్న 18 మంది అభ్యర్థులు 2012 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికై అరుదైన ఘనత సాధించారు. ఒకే గ్రామం నుంచి అంతమంది ఉద్యోగానికి ఎంపికైన దాఖలాలు రాష్ట్ర చరిత్రలోనే లేవు. అదే స్ఫూర్తితో ప్రతీసారి ఈ గ్రామం నుంచి ఉపాధ్యాయులుగా ఎంపిక అవుతూనే ఉన్నారు. తాజా డీఎస్సీలోనూ ఒక్క పీఈటీ, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు, ఆరుగురు ఎస్జీటీలు ఎంపికవడం గమనార్హం. వీరితోపాటు గ్రామంలో 17 మంది కానిస్టేబుళ్లతోసహా ఇతర విభాగాల్లోనూ ఉద్యోగులు ఉండటం విశేషం.

**వృత్తిపై మమకారం** ప్రాథమిక విద్య నుంచే ఉపాధ్యాయ వృత్తిపై మమకారం పెరిగింది. ఉపాధ్యాయుడిగా ఎంపికై పలువురిని ప్రయోజకులుగా తయారు చేయాలని ఉండేది. 2012 టెట్‌లో రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంకు సాధించాను. స్కూల్ అసిస్టెంటుగా ఎంపిక కావడం ఎంతో సంతోషం కలిగించింది. ఇటీవల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ఆంగ్ల అధ్యాపకుడిగా ఎంపికయ్యాను. టీటీసీ తరగతులు నిర్వహిస్తూ ఉపాధ్యాయ వృత్తిలోకి ఎంపికయ్యేలా సహాయం చేస్తున్నాను.
బైరి మార్కండేయ, జూనియర్ లెక్చరర్

**సీనియర్ల స్ఫూర్తితో..**

సీనియర్ ఉపాధ్యాయుల స్ఫూర్తితో నేను కూడా ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదివాను. బీఈడీ పూర్తి చేసి అనుకున్నది సాధించాను. కొన్నాళ్లపాటు మా గ్రామంలోని ఉన్నత పాఠశాలలోనే పని చేయడం ఎంతో సంతృప్తిని కలిగించింది. నా భార్య కూడా ఉపాధ్యాయురాలే. ఎవరైనా ఏదైనా అనుకుంటే అది సాధించే వరకూ ప్రయత్నిస్తూ ముందుకు సాగాలి.దాసరి శ్రీనివాస్, స్కూల్ అసిస్టెంట్

**మొదటి ప్రయత్నంలోనే..**

నేను మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాను. ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకోవడానికి కారణం మా గ్రామమే. ఇంత మంది గురువులను చూసి అందులో నేనూ ఒకడిని కావాలని అనుకొని ఆ దిశగా ప్రయత్నం చేశాను. ఆత్మవిశ్వాసం కోల్పోయిన ప్రతీసారి నన్ను స్నేహితులు ప్రోత్సహించారు. చివరకు ఇటీవలి ఫలితాల్లో ఎస్‌జీటీగా ఎంపికవడం సంతోషాన్నిచ్చింది.
బుర్ర శ్రీనివాస్, ఎస్జీటీ

# రామగుండానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

గోదావరిఖని: ఎట్టకేలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రామగుండానికి తరలివస్తుంది. ఏడాదిన్నర కాలంగా పెద్దపల్లిలోనే సేవలందించిన కార్యాలయాన్ని రామగుండంలో బుధవారం ప్రారంభించనున్నారు. రామగుండం ప్రజలకు సేవలు అందుబాటులో ఉండేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌పై గత ప్రభుత్వం ఈ ప్రాంతానికి ప్రత్యేకంగా కార్యాలయాన్ని కేటాయించింది. ఈ ప్రాంత భూములు, పెళ్లిళ్లకు పెద్దపల్లికి వెళ్లి రిజిస్ట్రేషన్ సేవలు పొందాల్సి ఉండేది. దీంతో చాలా మంది దూర ప్రాంతంలో ఉన్న కార్యాలయానికి వెళ్లేందుకు ఇబ్బంది ఎదుర్కొన్నారు. పెద్దపల్లిలో ఎక్కువ శాతం రిజిస్ట్రేషన్‌లన్నీ రామగుండం ప్రాంతానికి చెందినవే ఉండటంతో వెళ్లి రావడానికి ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలోనే గత ఏడాది ఏప్రిల్ 1న పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే తాత్కలికంగా రామగుండం కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే రామగుండానికి ప్రత్యేకంగా కేటాయించినా ఆయా సేవలకోసం మళ్లీ పెద్దపల్లికి వెళ్లాల్సి వచ్చింది.

నేడు ప్రారంభం రామగుండం పట్టణంలోని పాత మండల పరిషత్తు కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న మండల పరిషత్తు కార్యాలయ భవనానికి మరమ్మతులు చేయించారు. రామగుండం కార్పొరేషన్‌తో పాటు అంతర్గాం, పాలకుర్తి మండలాల ప్రజలకు సేవలు అందుబాటులో ఉంటాయి. బుధవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌తో పాటు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రారంభ కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఏడాదిన్నర కాలంగా పెద్దపల్లిలోనే సేవలందించిన రామగుండం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇప్పటి వరకు 8,462 భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు చేశారు. వీటి ద్వారా రూ.42.45 కోట్ల ఆదాయం సమకూరింది. వివాహాలకు సంబంధించి 1850 రిజిస్ట్రేషన్‌లు చేశారు. కాగా పారిశ్రామిక ప్రాంతానికి కేంద్రమైన గోదావరిఖని పట్టణ ప్రజలకు మళ్లీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సేవలు దూరం కానున్నాయి. గోదావరిఖనిలోనే ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు ఆశించారు. ఈ మేరకే రామగుండం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. రామగుండం రైల్వే స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాలంటే మళ్లీ దూరాభారం తప్పదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# నూతన ఒరవడి.. చేరువలో ప్రగతి

జగిత్యాల : రైతుల ఆదాయాన్ని పెంచేలా వ్యవసాయ రంగంలో కేంద్రం తలపెట్టిన ఏడు రకాల కార్యక్రమాలతో ఉమ్మడి జిల్లాలోని కర్షకులకు పలువిధాలా మేలు కలగనుంది. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించి, నిధులను కేటాయించిన కార్యక్రమాల అమలుతో కలిగే ప్రయోజనాలు ఇవి..

పాల ఉత్పాదకత పెంపు

ఉమ్మడి జిల్లాలో సాగుకు అనుబంధంగా దాదాపు 1.37 లక్షల మంది రైతులు పాడి పరిశ్రమను కొనసాగిస్తున్నా ఆశించిన ఫలితాలను పొందటం లేదు. పాడిలో ఉత్పాదకత పెంపు, పాలకు కనీస ధర చెల్లింపు, రాయితీపై మేలుజాతి పాడిపశువుల అందజేత, షెడ్లు, దాణా, గడ్డి విత్తనాలు, ఇతరత్రా సామగ్రిని రాయితీపై ఇవ్వటం, పశువైద్య సేవలను విస్తరించటం తదితరాలతో పాడి రైతులకు ఆర్థిక ఆసరాగా ఉంటుంది.కేవీకేలు బలోపేతం

దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాకో కృషివిజ్ఞాన కేంద్రం (కేవీకే)ను నెలకొల్పాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో కేవీకేలను ఏర్పర్చనున్నారు. ఇప్పటికే జమ్మికుంటలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, పెద్దపల్లి జిల్లా రామగిరి ఖిల్లాలో ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో కేవీకేలు పని చేస్తున్నాయి. అన్ని కేవీకేలను సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా, జిల్లాస్థాయి సమగ్ర వ్యవసాయ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని కేంద్రం నిర్ణయించింది. కేవీకేల నిర్వహణ, జీత భత్యాలను కేంద్ర వ్యవసాయశాఖ భరిస్తుంది. ముమ్ముందు కేవీకేల్లో వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ సమాచారం ఒకేచోట లభించి రైతులకు సేవలు మరింత చేరువవుతాయి.

పరిశోధనల విస్తరణ

పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంతోపాటు కరీంనగర్‌లో, పెద్దపల్లి జిల్లా కూనారంలో పరిశోధన స్థానాలున్నాయి. వీటిల్లో విత్తనాల రూపకల్పన, పంటల సరళి, యాజమాన్యం, నూతన సాంకేతికత రూపకల్పన పరిశోధనలను విస్తరించనున్నారు. కరీంనగర్‌లోని ఏరువాక కేంద్రం, వ్యవసాయ డిగ్రీ, వెటర్నరీ పాలిటెక్నిక్, జమ్మికుంట పాలిటెక్నిక్, కోరుట్ల వెటర్నరీ కళాశాల, పొలాసలోని వ్యవసాయ డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ కళాశాలలు, సిరిసిల్ల జిల్లాలోని వ్యవసాయ కళాశాల, పెద్దపల్లి జిల్లా రామగిరి ఖిల్లా ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలతో స్థానికంగా విద్య, సాగు విధానాల రూపకల్పన బలోపేతం కానుంది.

సాగులో శాస్త్రీయ విధానాలు

మూస పద్ధతిలో వ్యవసాయం చేస్తున్న వారికి పెట్టుబడి ఖర్చు పెరగటం, సగటు దిగుబడులు పెరగకపోవటంతో లాభసాటిగా ఉండటంలేదు. దీనికిగాను నూతన శాస్త్రీయ విధానాలవైపు రైతులకు మళ్లించనున్నారు. నాబార్డు ద్వారా ఆర్థిక సాయం అందించటం, ఆధునిక యంత్రాల వినియోగం, రాయితీపై పరికరాల సరఫరా, విత్తనశుద్ధి, సమగ్ర సస్యరక్షణ, సంఘటిత మార్కెటింగ్, ఉప ఉత్పత్తుల తయారీ తదితర అంశాలను ఆకళింపు చేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు.

ఉద్యాన పంటల సుస్థిరత

ఉద్యాన పంటల్లో సుస్థిరత కార్యక్రమంలో భాగంగా ఉద్యానపైర్ల సాగుకు ప్రోత్సాహాన్ని ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లాల్లో 1.95 లక్షల ఎకరాల్లో మామిడి, కూరగాయలు, మిరప, పసుపు, పండ్లు, పూలు తదితర ఉద్యాన పంటలు సాగులో ఉన్నా ఉద్యాన పరిశోధన స్థానం, ఉద్యాన శాస్త్రవేత్తల సేవలు అందుబాటులో లేక రైతులు నష్టపోతున్నందున ఈ లోటును సరిదిద్దేలా జిల్లాలో ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిఉంది.

సహజ వనరుల సంరక్షణ

ఉమ్మడి జిల్లా ప్రధానంగా వ్యవసాయాధారితం కాగా సహజ వనరులైన నేల, గాలి, నీటి సంరక్షణకు తగిన చర్యలను చేపట్టనున్నారు. సాలీనా కురుస్తున్న 973 మి.మీ. సగటు వర్షం కురుస్తున్నా 40 శాతం నీటిని కూడా నిల్వచేసే పరిస్థితి లేనందున వర్షపునీటి నిల్వను పెంచాలి. అన్ని వ్యవసాయ క్లస్టర్లలోని మినీ భూసార పరీక్ష కేంద్రాలను పనిచేసేలా చర్యలు తీసుకుని భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా రసాయన ఎరువుల వాడకాన్ని నిర్దేశిస్తే నేల ఫలదత నిలబడుతుంది.

ఆవిష్కరణలకు అవకాశం

డిజిటల్ అగ్రిమిషన్ ద్వారా వాతావరణ మార్పులు, సాగులో నిత్యం ఆచరణీయ అంశాలు, పంటల ధరలు తదితరాలను శాస్త్రవేత్తలు, అధికారులు, పరిశోధన సంస్థల నుంచి నేరుగా రైతుల చరవాణులకు చేరవేయనున్నారు. ఆన్‌లైన్‌లోనూ పలు వెబ్‌సైట్ల ద్వారా రైతులు తెలుసుకునే అంశాలను పొందుపరచనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించాలి. పొలాస పరిశోధన స్థానం ఆవరణలోని అగ్రి ఇంక్యూబేషన్ సెంటర్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తే యువ రైతుల ఉపాధికి, నూతన ఆవిష్కరణలకు అవకాశం ఏర్పడుతుంది.

# ఆక్రమణలు.. అనర్థాలు

కోరుట్ల: అధికారుల అలసత్వం.. స్థిరాస్తి వ్యాపారుల ఆక్రమణలతో ఏటా కోరుట్ల పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. శాశ్వత పరిష్కార మార్గాలను చూపడంలో పాలకులు పూర్తిగా విఫలమవుతున్నారు. మద్దుల చెరువు, తాళ్ల చెరువు, కంచరకుంట మత్తడి కిందున్న కాలువలు(ఒర్రెలు) ఆక్రమణలకు గురయ్యాయి. 10-15 అడుగుల వెడల్పు ఉన్న కాలువలు కబ్జాకు గురయ్యాయి. కొన్నిచోట్ల కాలువలను పూడ్చివేసి రోడ్లుగా ఏర్పాటు చేయగా అభివృద్ధి పేరిట బల్దియా అధికారులు సిమెంట్ రోడ్లుగా మార్చారు. మరికొన్నిచోట్ల కాలువ మార్గాలనే మార్చి.. రెండు, మూడడుగుల వెడల్పుతో మురుగు కాలువలుగా నిర్మించారు. దీంతో వర్షాకాలంలో వరద రోడ్లపై పోటెత్తుతోంది. జిల్లా ఉన్నతాధికారులు చొరవచూపి ఆక్రమణలను తొలగించి వరదలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టణంలోని రవీంద్రరోడ్ శివారులో తాళ్ల చెరువు ఉంది. అందులో ఎక్కువైన నీరు మత్తడి దూకి దాని కింద సుమారు 10-15 అడుగుల మేర ఉన్న కాలువ ద్వారా ఫుల్‌వాగులో కలిసేది. పట్టణం విస్తరించడంతో తాళ్ల చెరువు కింద కాలనీలు వెలిశాయి. దీంతో మత్తడి కిందున్న కాలువను అప్పటి పాలకులు పూడ్చివేసి సిమెంట్ రోడ్ నిర్మించారు. ఏటా వర్షాకాలంలో చెరువు మత్తడి దూకి రోజుల తరబడి వరద నీరు రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. రోడ్డుపై ప్రవహించే వరద ప్రమాదకరంగా ప్రవహిస్తోంది.

ముత్యాలవాడలో, పైప్రాంతంలో పలు కుంటలు ఉండటంతోపాటు ఏఖీన్‌పూర్ స్తంభాల చెరువు నుంచి కంచరకుంటకు వెళ్లేందుకు గోలుసుకట్టు కాలువ ఉంది. ఈ కాలువ, కుంటల పరిసరాల్లోని సాగు భూముల్లో అప్పట్లో రైతులు వ్యవసాయం చేసేవారు. ఎక్కువైన నీరు వెళ్లేందుకు కాలువ ఉండేది. పట్టణం విస్తరించడంతో కుంటలు అంతరించిపోయాయి. కాలువలు ఆక్రమణలు గురయ్యాయి. కంచరకుంట గోలుసుకట్టు కాలువను ఆధునీకరించకపోవడంతో పై ప్రాంతాల నుంచి వచ్చే నీరు ముత్యాలవాడను ముంచెత్తుతోంది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉంటుంది.

కోరుట్ల పట్టణం ప్రకాశం రోడ్‌లో మద్దుల చెరువు మత్తడి దూకిన నీరు వెళ్లేందుకు 10-15 అడుగుల వెడల్పుతో కూడిన కాలువ (ఒర్రె) ఉండేది. స్థిరాస్తి వ్యాపారులు కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. మరికొన్నిచోట్ల కాలువను పూడ్చివేసి రోడ్డును నిర్మించారు. బల్దియా అధికారులు అభివృద్ధి పేరిట ఆక్రమణలను పట్టించుకోకపోగా కేవలం 2-3 అడుగుల మేర మురుగు కాలువను నిర్మించి చేతులు దులుపుకొన్నారు. దీంతో పదేళ్లుగా నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో రోడ్డుపై వరద ప్రవహిస్తుండగా స్థానికులు ఇళ్లు ఖాళీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

# అమీర్‌పేటకు కొత్త రూపు.. చేపట్టే మార్పులు, చేర్పులు ఇలా...



హైదరాబాద్: హైదరాబాద్ నుంచి అమెరికాలోని సిలికాన్ వ్యాలీ వరకు అమీర్‌పేట అంటే తెలియని వారుండరు. ఐటీ, కంప్యూటర్ సైన్సులో కోర్సులు నేర్చుకోవాలంటే ఇక్కడికి రావాల్సిందే. అనేక రకాల కోచింగ్ సెంటర్లు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, వసతి గృహాలు, కళాశాలలతో నిత్యం కళకళలాడే అమీర్‌పేట రోజు రోజుకు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుంటోంది. వాహనాలపై రాకపోకలు సాగించే వారితోపాటు... షాపింగ్, కోచింగ్‌కు వచ్చే వారితో నిత్యం రద్దీగా ఉంటోంది. ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవడం, రోడ్లపైకి చిరు వ్యాపారులు రావడంతో పాదచారులకు నడిచే మార్గాలు ఉండటం లేదు. దారులన్నీ ఆక్రమణలతో ఇరుకుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో అమీర్‌పేట చుట్టూ నలువైపులా కూడళ్లను అభివృద్ధి చేయడం.. వివిధ మార్పులు చేర్పులతో ట్రాఫిక్ పద్మవ్యూహం నుంచి ఉపశమనం కల్పించేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, టీజీఎస్‌ఆర్టీసీ, హెచ్‌ఎంఆర్‌ఎల్, హెచ్‌ఎండీఏలోని హుమ్మా కలిసి ఇందుకు శ్రీకారం చుడుతున్నాయి.

చేపట్టే మార్పులు, చేర్పులు ఇలా...

ప్రస్తుతం స్వర్ణజయంతి కార్యాలయం సమీపంలో ఉన్న బస్టాప్‌లో ఒకదానిని మెట్రో స్టేషన్ కిందకు మార్చనున్నారు. ప్రస్తుతం మెట్రో దిగిన ప్రయాణికులు మళ్లీ వెనక్కి వెళ్లి బస్సు ఎక్కాల్సి వస్తోంది. బస్టాప్‌ను మెట్రో స్టేషన్ కిందకు మార్చడం ఊరట కలగనుంది.

సత్యం థియేటర్ నుంచి పంజాగుట్ట వైపు వెళ్లే వాహనాలకు ఫ్రీలెఫ్ట్‌తో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇక నుంచి ఫ్రీలెఫ్ట్‌ను నియంత్రించేందుకు మ్యానువల్‌గా లేదా సిగ్నల్‌ను ఏర్పాటు చేయనున్నారు.

అమీర్‌పేట స్వర్ణజయంతి జంక్షన్‌లో నలువైపులా వాహనాలు అడ్డదిడ్డంగా దూసుకొస్తున్నాయి.సారథి స్టూడియో వైపు నుంచి వచ్చే వాహనాలు క్రమ పద్ధతిలో వెళ్లేలా ఇక్కడ ఐల్యాండ్‌ను అభివృద్ధి చేయనున్నారు.

అమీర్‌పేట నుంచి బేగంపేట వెళ్లే మెట్రో రహదారి కింద రోడ్డు స్థానిక వ్యాపారులతో పూర్తిగా కబ్జాకు గురైంది. నడిచే వెళ్లే వారికి ఫుట్‌పాత్ కనిపించడం లేదు. ఇక్కడ వ్యాపారులకు ప్రత్యామ్నాయంగా సత్యం థియేటర్ ముందు భాగంలో ఖాళీ స్థలంలో కేటాయించనున్నారు. కనకదుర్గ ఆలయం జంక్షన్‌లో సిగ్నల్ వ్యవస్థను తీసుకురానున్నారు.అమీర్‌పేట జంక్షన్ నుంచి పంజాగుట్ట వైపు ఫుట్‌పాత్‌లు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. కేఎల్‌ఎం మాల్ వద్ద ఫుట్‌ఓవర్ వంతెనను అందుబాటులోకి తేవడంతోపాటు పాదచారులకు సౌకర్యాలు కల్పించనున్నారు. పంజాగుట్ట శ్మశానం వద్ద స్టీల్ వంతెన ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

# వేచి చూడాల్సిందేనా..!



వికారాబాద్ : వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, వరదలతో జిల్లాలో మారుమూల తండాలోని పీహెచ్‌సీ నుంచి పట్టణంలోని జిల్లా ఆసుపత్రి వరకు రోగులతో నిండిపోతున్నాయి. అతిసారం, జ్వరం, తలనొప్పి, కడుపునొప్పి, దగ్గు, ఒంటినొప్పులు, మోకాళ్ల నొప్పులు, డెంగీ, టైఫాయిడ్ తదితర సమస్యలతో బాధపడుతున్నారు. వీరికి సేవలు అందించడంలో ఎక్కడా తగినంత మంది వైద్యులు లేరు. దీంతో తమవంతు వచ్చే వరకు అలాగే వేచి చూడటమో లేక ఫీజుల భారం భరిస్తూ ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లడమో చేయాల్సి వస్తోంది. జిల్లాలో వైద్య విధాన పరిషత్తు, వైద్య శాఖ, ప్రభుత్వ మెడికల్ బోర్డు అధీనంలో ఆసుపత్రులున్నాయి. అన్ని చోట్ల సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లా వ్యాపంగా 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు (పీహెచ్‌సీలు) నిత్యం 2,300 నుంచి 4,500 మంది వరకు బయటి రోగులు వస్తుంటారు. వీరికి తగినట్లుగా వైద్యులు లేక గంటల తరబడి వేచి చూస్తున్నారు.

వికారాబాద్ జనరల్ ఆసుపత్రిలో మొత్తం 86 మంది డాక్టర్లకు కేవలం 56 మంది, అలాగే 203 మంది నర్సులకు 143 మంది మాత్రమే ఉన్నారు.తాండూరు జిల్లా ఆసుపత్రి ఎంతో కీలకమైంది. నియోజకవర్గంలోని పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాలతో పాటు పట్టణ పరిధి, సరిహద్దు రాష్ట్రం కర్ణాటక, పొరుగు నియోజకవర్గం కొడంగల్ నుంచి ఈ ఆస్పత్రికి రోజుకు 500 నుంచి 600 దాకా బయటి రోగులు వస్తుంటారు. సాధారణ రోగ నిర్ధరణ పరీక్షలు ఇక్కడే చేస్తున్నారు. థైరాయిడ్ వంటి కొన్ని ప్రత్యేక పరీక్షల కోసం మాత్రమే నమూనాలను హైదరాబాద్‌కు పంపిస్తున్నారు.

ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు

డివిజన్ పరిధిలోని పల్లె దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వాటి పరిధిలో ఉప కేంద్రాల్లో సిబ్బంది, మందుల కొరత వేధిస్తోంది. గ్రామాల్లో చాలా మంది తప్పనిసరై ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వారు అందిన మేర దోచుకుంటున్నారు.

మెరుగైన సేవలకు కృషి చేస్తున్నాం

డాక్టర్ పల్వన్‌కుమార్, జిల్లా వైద్యాధికారి, వికారాబాద్

జిల్లాలో సిబ్బంది కొరత అంతగా లేదు. అన్నిచోట్ల మెరుగైన వైద్యసేవలు లభించేలా కృషి చేస్తున్నాం. ప్రాథమిక, ఇతర ఆసుపత్రుల్లో ఎక్కడా మందుల కొరత లేదు. వర్షాకాలం వ్యాధుల విషయంలో వైద్యాధికారులు అప్రమత్తంగా ఉన్నారు.

కొరత లేకుండా చూస్తాం

- జీవరాజు, జిల్లా ఉప వైద్యాధికారి

ప్రస్తుతం వ్యాధుల సీజన్ కావటంతో రోగుల సంఖ్య పెరుగుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో ఎక్కడా మందుల కొరత లేకుండా వెంటనే చర్యలు చేపడతాం. ముందే సంబంధిత అధికారులకు వివరాలు పెడుతున్నాం.

# స్కీములు.. స్కాములు

హైదరాబాద్ : కార్పొరేట్ సంస్థల తరహాలో కార్యాలయాలు, ఖరీదైన కార్లలో ప్రయాణం, రంగురంగుల బ్రోచర్లు, తీయని మాటలు, రోజుల వ్యవధిలో రూ.కోట్లలో వసూళ్లు... ఇదీ ప్రస్తుత నేరగాళ్ల తీరు. నగరంలో దోపిడీ, దొంగతనాలు సాధారణమవుతున్నాయి. వీటి స్థానంలో ఆర్థిక నేరాలు గణనీయంగా పెరుగుతున్నాయి. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో ఆర్థిక నేరాలు, నమ్మకద్రోహం, చీటీల పేరుతో వసూళ్లు వంటి నేరాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. అంతిమంగా మధ్యతరగతి ప్రజలు బలైపోతున్నారు.

నగరంలో ఏటా 10 శాతం చొప్పున పెరుగుదల

నగరంలో ఏటా సగటున 10 శాతం కంటే ఎక్కువగా ఆర్థిక నేరాలు, చీటింగ్ వంటి కేసులు పెరుగుతున్నాయిముఖ్యంగా చీటీలు, పెట్టుబడులకు మూడింతలు లాభాలు, ముందు డిపాజిట్లు కడితే తర్వాత వడ్డీతో కలిపి చెల్లింపులు, భూములపై పెట్టుబడులు పెట్టాలని నమ్మించి మోసం చేస్తున్న కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.

గత మూడేళ్లలో నగరంలోని మూడు కమిషనరేట్లలో దోపిడీలు, దొంగతనాలు, సొత్తుకోసం హత్య వంటి అన్ని రకాల చోరీ కేసులు 9- 10 వేల మధ్య ఉన్నాయి.ఇదే సమయంలో ఆర్థిక నేరాల సగటు గణనీయంగా పెరుగుతోంది. హైదరాబాద్ ఆర్థిక నేరాల విభాగం



(ఈవోడబ్ల్యూ)లో 2022లో 949 కేసులు నమోదయ్యాయి. 2023లో అంతకుమించి నమోదయ్యాయి. సైబరాబాద్ ఈవోడబ్ల్యూలో ఈ ఏడాది 65 వరకూ ఆర్థిక నేరాలు నమోదయ్యాయి. ఇవన్నీ రూ.75 లక్షల నుంచి రూ.40 కోట్ల వరకూ ఉన్నాయి.

ఇవీ జాగ్రత్తలు..

రూ.లక్షకు నెలకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటించినప్పుడు.. ఇలాంటి వడ్డీ బ్యాంకులు ఎందుకు ఇవ్వలేకపోతున్నాయో గమనించాలి. ఇంటి పక్కవారు, స్నేహితులు అధిక వడ్డీ ఇస్తామంటే మోసమే.

# నిధులు వాగుల పాలు

వేములవాడ: వాగులపై పైవంతెనలు లేక ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఏటా కురుస్తున్న భారీ వర్షాలకు తాత్కాలిక రహదారులు కొట్టుకుపోతున్నాయి. ఫలితంగా రూ.లక్షల నిధులు వాగుల్లో కలుస్తున్నాయి. ప్రతి సంవత్సరం ప్రజాధనం వృథా అవుతున్నా పైవంతెనల నిర్మాణం చేపట్టక రవాణా కష్టాలు తీరడం లేదు.

వాగులు, ఒర్రెల వద్ద పైవంతెనలు నిర్మించాల్సి ఉన్నప్పటికీ నిధులు మంజూరు కాక లక్షలాది రూపాయలు వెచ్చించి మొరం, మట్టితో తాత్కాలిక రోడ్లు వేస్తున్నారు. ఇందుకు కిలో మీటరు పొడవు తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణానికి రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు మొరం మందాన్ని బట్టి ఖర్చు అవుతుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. భారీ వర్షాల కారణంగా వరదలు వచ్చి కొట్టుకుపోయి నిధులు నీటి పాలవుతున్నాయి. అయినా నేతలు, అధికారులు పైవంతెనల నిర్మాణం చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తాత్కాలిక రోడ్లు మొత్తం కొట్టుకుపోయి ప్రజల రవాణాకు ఆటంకం ఏర్పడింది. కొన్నిచోట్ల పైవంతెనల నిర్మాణ పనులు చేపట్టినా అవి పూర్తికాలేదు. వాటి దగ్గర వేసిన తాత్కాలిక రోడ్లు సైతం వరదకు నామరూపాల్లేకుండా పోయాయి.

వేములవాడ గ్రామీణ మండలంలోని హన్మాజీపేట నక్కవాగు వద్ద వంతెన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి కాక పక్కనే వేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఇటువైపు వెళ్లే బొల్లారం, లింగంపల్లి, మామిడిపల్లి తదితర గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వేములవాడ నుంచి బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లి వైపు రోడ్డులో వంతెన పనులు చేపట్టినప్పటికీ అది పూర్తి కాలేదు. ఇక్కడ కూడా రోడ్డు వరదకు ఆనవాళ్లు లేకుండా పోయింది.

కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి- నిజామాబాద్ గ్రామాల మధ్య, ఇదే విధంగా బావుసాయిపేట- వెంకట్రావ్‌పేట మధ్య మూలవాగు ఉద్ధృతంగా పారడంతో తుడిచిపెట్టుకుపోయాయి. వట్టిమల్ల- నిమ్మపల్లి గ్రామాల మధ్య కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

చందుర్తి మండలంలోని మర్రిగడ్డ- సనుగుల, కోనరావుపేట మండలంలోని కొండాపూర్, జవహరిపేట- నర్సక్కపేట, రుద్రంగి మండలంలోని మానాల ప్రాంతాల్లోనూ రోడ్లు భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి. వేములవాడ పట్టణంలోని బతుకమ్మ తెప్ప నుంచి తిప్పాపూర్ మధ్య మూలవాగులో రాజరాజేశ్వరస్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి సందర్భంగా ఈ ఏడాది దాదాపు రూ.5 లక్షల వెచ్చించి నిర్మించిన మట్టి రోడ్డు వరదలో కలిసిపోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాగులపై పైవంతెనల నిర్మాణం చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు చర్యలుఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. వర్షాలు తగ్గిన తరవాత అంచనాలు సిద్ధం చేసి పనులు చేపడతాం.

శాంతయ్య, డీఈ, ఆర్‌అండ్‌బీ

# హద్దులు తేలక.. హక్కులు తెలియక

సిరిసిల్ల : ప్రభుత్వ, ప్రైవేటు భూముల పహాణీలు, 1బి దస్త్రాలన్నీ వారి చేతుల్లోనే ఉన్నాయి. ఏం చేయాలనుకున్నా చేసే అధికారమూ ఉంటుంది. ఇదే అదనుగా ఓ రెవెన్యూ ఉద్యోగి హద్దుల్లేని ప్రభుత్వ భూమిలో పట్టా పొందాడు. రైతుబంధు జమవుతుండటంతో రెండేళ్ల క్రితం గ్రామస్థులు గుర్తించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతుబంధును నిలిపివేయించారు. రెండ్రోజుల క్రితం అదే భూమికి హక్కుదారులమంటూ మరికొందరొచ్చారు. పశువుల మేత కోసం వదిలిన గుట్టప్రాంతాన్ని చదును చేయడాన్ని గ్రామస్థులు అడ్డుకున్నారు. హద్దుల్లేని రెవెన్యూ, అటవీ భూమిలో హక్కులు కల్పించడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలోని కోనరావుపేట మండలంలో గతంలో పని చేసిన ఓ రెవెన్యూ ఉద్యోగి శివంగళపల్లి అడవి సరిహద్దులోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని దస్త్రాల్లో తన పేరున మార్చుకున్నాడు. గత ప్రభుత్వం 2018లో భూదస్త్రాల ప్రక్షాళన తర్వాత కొత్తగా ధరణిని తీసుకొచ్చింది. దీనిలోని రైతుల వివరాల ఆధారంగా రైతుబంధు అమలు చేసింది. ఇలానే నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.40 వేలు చొప్పున జమయ్యాయి.

2021లో రైతుబంధు లబ్ధిదారుల జాబితాను గ్రామంలో ప్రదర్శించడ ంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానికులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో రైతుబంధును నిలిపివేశారు. భూమి పట్టా రద్దు కాలేదు.

ఇటీవల కొందరు గుట్టపై ఉన్న భారీ వృక్షాలను యంత్రాల సాయంతో నేలకూల్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అడ్డు చెప్పడంతో పాటు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు పరిశీలించి అది అటవీశాఖ పరిధిలోనిది కాదని తేల్చారు. అయితే అనుమతి లేకుండా భారీ వృక్షాలను నరికినందుకు జరిమానా విధించారు.



చాలా ఏళ్ల క్రితం గ్రామంలోని నిరుపేదలకు అడవి సమీపంలోని ప్రభుత్వ భూమికి పట్టాలిచ్చారు. మిగిలిన భూమిని గ్రామంలో పశువుల మేతకు వదిలేశారు. ఇలా పట్టాలు చేయగా ఉన్న భూమిని దస్త్రాల్లోకి తన పేరున మార్చుకున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ధరణిలోనూ ఈ భూముల వివరాలేవీ చూపకపోవడంతో చేతులు మారినట్లు చెబుతున్నారు.

ఇలాంటివి ఎక్కడెక్కడ ఉన్నాయంటే...

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు స్థానంలో రైతుభరోసాను ప్రకటించింది. గుట్ట ప్రాంతాన్ని సాగులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లాలో రెవెన్యూ, అటవీ భూముల వివాదాలు కోనరావుపేట మండలం నిమ్మపల్లి, జైసేవాలాల్‌ఊరు తండా, వట్టిమల్లతోపాటు చందుర్తి, వీర్నపల్లి మండలాల్లోనూ ఉన్నాయి. కాగా ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ, అటవీ భూములు ఉండటంతో గుర్తించడం కష్టంగా మారింది. అటవీశాఖ అధికారులు కంపార్టుమెంట్లు, కోఆర్డినేట్లు తీసుకుని కొలతలు వేస్తున్నారు. పలు గ్రామాల్లో సర్వే సమయంలో రెండు శాఖల మధ్య తేడాలు వస్తున్నాయి. దీనికి తోడు దస్త్రాల నిర్వహణలోనూ లోపాలు ఉన్నాయి.

ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది

ప్రభుత్వ, అటవీ భూముల మధ్య హద్దులు లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శివంగళపల్లిలోని భూ వ్యవహారం జిల్లా అధికారుల దృష్టిలో ఉంది. దీనికి సంబంధించిన దస్త్రాలను అప్పగించాం. ఇప్పటికే రైతుబంధును నిలిపివేశారు. ఆ భూమిని గ్రామస్థులంతా గ్రామ అవసరాలకు ఉపయోగపడేలా ఉంచాలని కోరుతున్నారు.విజయప్రకాశ్, తహసీల్దార్





# కాలినడకన తిరుమల వెళ్తున్నారా?తితిదే తాజా సూచనలు ఇవే!

తిరుమల: ఇటీవల తిరుమలకు కాలి నడకన వచ్చిన భక్తుల్లో కొందరు అస్వస్థతకు గురైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో కాలినడకన వచ్చి శ్రీవారి దర్శించుకోవాలనుకుంటున్న భక్తులకు తితిదే పలు సూచనలు చేసింది. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్న వాళ్లు మెట్ల మార్గాన్ని ఎంచుకోకూడదు? ఒకవేళ రావాల్సి వస్తే, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? వైద్య సదుపాయాలు ఎక్కడెక్కడ అందుబాటులో ఉన్నాయి? అన్న విషయాలను తితిదే తెలిపింది. 60 ఏళ్లు దాటిన వృద్ధులు, మధుమేహం, అధిక రక్తపోటు, ఉబ్బసం, మూర్ఛ, కీళ్ల వ్యాధులు ఉన్న భక్తులు తిరుమలకు కాలినడకన రావడం మంచిది కాదు. ఊబకాయంతో బాధపడుతున్న భక్తులు, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు తిరుమల కొండకు నడక దారిన రావడం శ్రేయస్కరం కాదు. తిరుమల కొండ సముద్ర మట్టానికి చాలా ఎత్తులో ఉండటం కారణంగా ఆక్సిజన్ స్థాయి తక్కువగా ఉంటుంది. కాలినడకన రావడం చాలా ఒత్తిడితో కూడుకున్న విషయం కాబట్టి గుండె సంబంధిత వ్యాధులు, ఉబ్బస వ్యాధిని తీవ్రతరం చేసే అవకాశం ఉంది భక్తులు తదనగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న భక్తులు వారి రోజు వారి మందులు వెంట తెచ్చుకోవాలి. కాలినడకన వచ్చే భక్తులకు ఏమైనా సమస్యలు ఎదురైతే అలిపిరి కాలిబాట మార్గంలోని 1500 మెట్టు, గాలి గోపురం, భాష్యకార్ల సన్నిధి వద్ద వైద్య సహాయం పొందవచ్చు. తిరుమలలోని అశ్వినీ ఆస్పత్రి, ఇతర వైద్యశాలల్లో 24ఐ7 వైద్య సదుపాయం అందుబాటులో ఉంది. దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అత్యవసర పరిస్థితుల్లో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ సౌకర్యం కల్పిస్తున్నాం. అని తితిదే తెలిపింది.

# తెదేపా సభ్యత్వ నమోదు అక్టోబర్ నేటి నుంచే

## రూ.100తో రూ.5 లక్షల వరకు బీమా



అమరావతి: తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమంపై ఆ పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సమీక్షించారు. పార్టీని బలోపేతం చేయడం, నామినేటెడ్ పదవుల భర్తీపై ఉండవల్లిలోని తన నివాసంలో నేతలతో చర్చించారు. శనివారం (అక్టోబర్ 26) నుంచి ప్రారంభమయ్యే తెదేపా సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టేలా తెదేపా ఏర్పాట్లు చేస్తోంది. రూ.100 సభ్యత్వంతో తెదేపా కార్యకర్తలకు రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా, వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, ఉపాధి కోసం సాయం అందించనున్నారు. అలాగే, రెండో దఫా నామినేటెడ్ పదవుల భర్తీపై ఉదయం నుంచి మూడు గంటల పాటు నేతలతో సీఎం చర్చించారు. సాధ్యమైనంత త్వరగా రెండో లిస్ట్ విడుదల చేసేలా కసరత్తు చేస్తున్నారు. మొదటి దశలో ఇచ్చిన 21 నామినేటెడ్ పదవులకు రెట్టింపు సంఖ్యలో రెండో జాబితా ఉంటుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో కూటమి పక్షాలతోనూ చంద్రబాబు సంప్రదింపులు జరుపుతున్నారు. కష్టపడిన వారికే పదవి అనే విధానంలో భాగంగా నామినేటెడ్ పోస్టులకు ఎంపికపై చర్చిస్తున్నారు.

# ఏపీ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహద పడుతుంది: పురందేశ్వరి




విజయవాడ: ఏపీ రాష్ట్ర ప్రజలందరూ ఈ రోజు పండగ చేసుకోవాల్సిన అవసరం ఉందని.. డబల్ ఇంజిన్ సర్కార్ ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందని గతంలోనే చెప్పానని.. ఇప్పుడు జరుగుతుందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. అశ్వినీ వైష్ణవ్, సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, అందరూ రూ. 2,245 కోట్ల నిధులతో ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు 57 కిలోమీటర్లు మేరకు అమరావతికి ప్రత్యేక రైల్వే లైన్‌ను కేంద్రం మంజూరు చేసిన అంశాన్ని ప్రకటించటం సంతోషంగా వుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహద పడుతుందన్నారు. ఏపీ ఆర్థిక అభివృద్ధితో ముడిపడిన అంశమని. పర్యావరణ మార్పు వస్తున్న ఈ పరిస్థితుల్లో అడవికి హాని కలగకుండా అంటే 25 లక్షల చెట్లు కాపాడబడ్డాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్రానికి ఏపీ రాష్ట్ర ప్రజల తరపున ధన్యవాదములు తెలుపుతున్నానని పురందేశ్వరి అన్నారు. అమరావతినే రాజధాని అని మొదటి నుంచీ బీజేపీ చెబుతోందని, కేంద్రం కూడా అమరావతి రాజధాని అని మొదటి నుండి ప్రతిపాదిస్తూనే వస్తోందని పురందేశ్వరి అన్నారు. రాజధాని కోసం ప్రత్యేక నిధులు ప్రపంచ బ్యాంకుల నుంచి ఇప్పిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రైల్ లైన్ కోసం భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు వస్తున్నారన్నారు. వికసిత్ భారత్ 2047 వరకు సాధించాలనేది బీజేపీ లక్ష్యమని చెప్పారు. వికసిత్ భారత్ కావాలంటే.. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కూడా ముఖ్యమని తెలుసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సింహ భాగం కేంద్రం నిధులు ఇస్తుందన్నారు. అమరావతి రాజధానికి ప్రత్యేక రైల్వే లైన్ మంజూరు చేసిన కేంద్రానికి మరోసారి రాష్ట్ర తరపున, ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నానని పురందేశ్వరి అన్నారు.

# విజయవాడ వరద బాధితులకు పరిహారం విడుదల..

అమరావతి, అక్టోబర్ 25: విజయవాడ వరద బాధిత ప్రజల్లో మరికొంత మందికి ప్రభుత్వం పరిహారం విడుదల చేసింది. శుక్రవారం మరో 1501 మందికి రూ.2.5 కోట్ల పరిహారం విడుదలైంది. 1501 మంది బాధితులకు వారి అకౌంట్లకు ఈరోజు నగదును సర్కార్ బదిలీ చేసింది. ఇందులో బ్యాంక్ అకౌంట్ ఇనాక్టివ్‌గా ఉన్న కారణంతో 143 మందికి లబ్ధిదారుల అకౌంట్లలో పరిహారం జమ అవ్వలేదని అధికారులు గుర్తించారు. వీరికి సంబంధించి మరోసారి బ్యాంకు వివరాలు తీసుకుని పరిహారాన్ని అందించనున్నారు. బ్యాంకు అకౌంట్లు అందుబాటులో లేని మరో 256 మంది అర్హుల వివరాలను ఆయా సచివాలయాలు, ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా ప్రభుత్వం వెల్లడించనున్నారు. బ్యాంక్ అకౌంట్ వివరాలు అందించి ఈ 256 మంది తమకు వచ్చే పరిహారం పొందవచ్చని అధికారులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పరిహారం అందాలన్న సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అధికారులు వెల్లడించారు. పరిహారం అందజేతపై తాజా వివరాలు ముఖ్యమంత్రి కార్యాలయానికి జిల్లా అధికారులు తెలియజేశారు. కాగా.. విజయవాడలో వరదలు ఎంతటి బీభత్సాన్ని సృష్టించాయో అందరికీ తెలిసిందే. విజయవాడను వరదలు ముచ్చెత్తడంతో ప్రజలు అల్లాడిపోయారు. వరద ఉధృతితో విజయవాడ వాసులు సర్వం కోల్పోయారు. విజయవడ వరద పరిస్థితిపై వెంటనే అప్రమత్తమైన ప్రభుత్వ యంత్రాంగం.. సీఎం సహా, అధికారులు అంతా వరద సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏకంగా పది రోజుల పాటు అక్కడే ఉంటూ.. వరద ముంపు ప్రాంతాల్లో తిరుగుతూ బాధితులను పరామర్శించారు. అంతేకాకుండా వరద ఉధృతితో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం



ముందుకొచ్చింది. వారికి వరద సహాయాన్ని సర్కార్ ప్రకటించింది. ఈ మేరకు సెప్టెంబర్‌లో విజయవాడలోని 179 సచివాలయాల పరిధిలోని ప్రజలకు వరద సహాయాన్ని వారి ఖాతాల్లో వేశారు. ఇళ్లు, దుకాణాలు, తోపుడు బళ్లు, వ్యాపారాలు, చిన్న తరహా పరిశ్రమలు, వాహనాలు, పంటలు, పశువులకు ఆర్థిక సాయం అందించింది. వరదలు వచ్చిన 15 రోజుల్లోనే బాధితులకు వారి ఖాతాల్లో వరద సహాయాన్ని జమ చేసింది సర్కార్. మొత్తం రూ.618 కోట్లను పరిహారంగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. విడతల వారీగా ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బును జమచేస్తోంది. ముందుగా రూ.602 కోట్లను జమ చేసిన సర్కార్.. ఆ తరువాత రూ.9 కోట్లు.. ఆపై రూ. 16 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసింది. మొత్తం 4,19,528 మందికి ప్రభుత్వం పరిహారం అందజేసింది. అలాగే తాజాగా 2954 మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో 1646 మందిని అర్హులుగా గుర్తించారు. వారిలో ప్రస్తుతం 1501 మంది బాధితులకు రూ.2.5 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం అందజేసింది.

# అమరావతికి రైల్వే లైన్.. ఏపీ భాజపా సంబరాలు



విజయవాడ: అమరావతికి కేంద్ర ప్రభుత్వం రైల్వే లైన్ మంజూరు చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడలోని భాజపా కార్యాలయంలో బాణసంచా కాల్చి ఆ పార్టీ నేతలు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు దిల్లీ వెళ్లి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగానే.. క్యాబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదం తెలిపారని చెప్పారు. రైల్వే లైన్‌ను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని కేంద్రాన్ని కోరతామన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తోందని పురందేశ్వరి చెప్పారు.




# వైఎస్సార్ అభిమానులకు షర్మిల మూడు పేజీల బహిరంగ లేఖ

అమరావతి: ఏపీ మాజీ సీఎం జగన్‌పై వైఎస్ షర్మిల మరో సారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు వైఎస్సార్ అభిమానులకు 3 పేజీల బహిరంగ లేఖ రాశారు. వైఎస్ అభిమానులకు వాస్తవాలు తెలియజేసే ప్రయత్నంలో భాగంగానే ఈ లేఖ రాసినట్లు పేర్కొన్నారు. "ఈరోజు పొద్దున సాక్షి పేపర్ చూశాను. సాక్షి మీడియా జగన్ మోహన్ రెడ్డి చేతిలో ఉంది. కాబట్టి ఏదైనా నమ్మించగలరు. అయినా వైఎస్సార్ అభిమానులకు అసలు వాస్తవాలు తెలియజేసే ప్రయత్నం నాది. అమ్మ వైఎస్ విజయమ్మ, నాన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి గురించి ఒక పుస్తకం రాశారు. అందులో నాన్న గురించి ప్రత్యేకంగా ఒక మాట రాశారు. 'రాజశేఖర్ రెడ్డి గారికి లోకం అంతా ఒకెత్తయితే.. తన బిడ్డ షర్మిల ఒకెత్తు అని రాశారు. నాన్నకు నేనంటే ప్రాణం. నాన్న నన్ను ఎప్పుడూ ఆడపిల్ల కదా అని చిన్న చేసో, తక్కువ చేసో చూడలేదు. నాన్న బతికి ఉన్నన్ని రోజులూ ఒకే మాట అనేవారు. 'నా' నలుగురు గ్రాండ్ చిల్డ్రన్ నాకు సమానం.

**నలుగురు గ్రాండ్ చిల్డ్రన్‌కూ సమాన వాటా.. అది వైఎస్సార్ మ్యాండేట్ :** వైఎస్సార్ బతికి ఉండగా స్థాపించిన అన్ని కుటుంబ వ్యాపారాల్లో నలుగురు గ్రాండ్ చిల్డ్రన్‌కూ సమాన వాటా ఉండాలి. రాజశేఖర్ రెడ్డి ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాలు కుటుంబ వ్యాపారాలే. అవి జగన్ మోహన్ రెడ్డి సొంతం కాదు. ఉన్న అన్ని కుటుంబ వ్యాపారాలకు జగన్ 'గార్డియన్' మాత్రమే. అన్ని వ్యాపారాలు నలుగురు చిన్న బిడ్డలకు సమానంగా పంచి పెట్టాల్సిన బాధ్యత ఆయనదే. ఇది రాజశేఖర్ రెడ్డి మ్యాండేట్. వైఎస్సార్ ఈ ఉద్దేశం ఆయన బిడ్డలమైన మాకు, ఆయన భార్యకు, కేవీపీ రామచంద్రరావు, వైవీ సుబ్బారెడ్డి, విజయ సాయిరెడ్డి సహా సన్నిహితులందరికీ స్పష్టంగా తెలుసు. నాన్న బతికి ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాల్లో సరస్వతి, భారతి సిమెంట్స్, సాక్షి మీడియా, క్లాసిక్ రియాలిటీ, యలహంక ప్రాపర్టీ, ఇలాంటివి ఏమైనా.. నలుగురు గ్రాండ్ చిల్డ్రన్‌కు సమాన వాటా ఉండాలన్నది వైఎస్ఆర్ మ్యాండేట్.

**జగన్ చెబుతున్నవన్నీ కుటుంబ ఆస్తులే..** ఒక్క సండూర్ మినహా రాజశేఖర్ రెడ్డి బతికున్నంత వరకు ఏ ఒక్క ఆస్తి పంపకం కూడా జరగలేదు. వైఎస్సార్ హఠాత్తుగా మరణించారు. తర్వాత కూడా ఏ ఆస్తి పంపకాలు జరగలేదు. ఈరోజు వరకు నాకు న్యాయంగా రావాల్సిన ఒక్క ఆస్తి కూడా నా చేతుల్లో లేదు. స్వార్జితం అని జగన్ మోహన్ రెడ్డి చెబుతున్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే. రాజశేఖర్ రెడ్డి బతికి ఉన్నప్పుడే ఆస్తులు పంపిణీ చేశారనేది అవాస్తవం. ఈరోజు సాక్షిలో చూపినట్లుగా మా తాతల ఆస్తి చిన్నప్పుడే నా పేరు మీద పెట్టినంత మాత్రాన, అది నాన్న నాకు పంచిన ఆస్తి కాదు. ఇతరులతో ఒక వ్యాపారంలో చిన్న భాగం నా పేరు మీద పెడితే అది ఆస్తి పంచి ఇచ్చినట్లు కాదు. ఆస్తి పంచడం అంటే ఇవిగో ఈ ఆస్తులు.. నీకు ఇక ఇంతే అని మా నాన్న నాకు చెప్పి ఉంటే అది ఆస్తి పంచేయడమంటే..! నేను జగన్ మోహన్ రెడ్డి ఆస్తుల్లో వాటా అడుగుతున్నాను అనేది హాస్యాస్పదం. ఇవన్నీ కుటుంబ ఆస్తులు కనుక రాజశేఖర్ రెడ్డి నలుగురు చిన్న బిడ్డలకు సమానంగా పంచాలి అనుకున్నారు. కాబట్టే ఈ రోజు వరకు వీటి గురించి మాట్లాడుతున్నాం.

**ఏ స్వార్థం లేకుండా ఆయన పార్టీని భుజాలపై మోశాను..** నాకంటూ వ్యక్తిగతంగా ఈ ఆస్తులపై మోజు లేదు. వీళ్లు పెట్టిన హింసలకు ఈ ఆస్తులు కావాలనే కోరిక కూడా లేదు. కేవలం నా బిడ్డలకు ఈ ఆస్తులు చెందాలి అనేది రాజశేఖర్ రెడ్డి అభిమతం గనుక.. ఈ రోజు వరకు కూడా అమ్మైనా, నేనైనా తపన పడుతున్నాం. ఇప్పటికీ అమ్మ వెయ్యి సార్లు వీళ్లను అడిగి ఉంటుంది. వందల కొద్దీ లేఖలు రాసి ఉంటుంది. అయినా నా బిడ్డలకు చెందాల్సిన ఆస్తిలో ఒక్కటి కూడా ఇవ్వలేదు. రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత 10 ఏళ్లు జగన్ ఇబ్బందులు పడితే, అవి నా ఇబ్బందులు అనుకొని.. నా శక్తికి మించిన సాయం చేశాను. తోడబుట్టిన వాడికోసం నా బిడ్డలను సైతం పక్కనపెట్టి ఆయన్ను, ఆయన పార్టీని ఏ స్వార్థం లేకుండా నా భుజాల మీద మోశాను. ఆ 10 ఏళ్లు నా అవసరం ఉంది అనుకున్నారో.. ఏమో.. నన్ను బాగానే చూశారు. పెద్ద కూతురు అన్నారు. రాజశేఖర్ రెడ్డి ఊహించినట్లుగానే గ్రాండ్ చిల్డ్రన్ నలుగురు సమానం అన్నట్లుగానే వ్యవహరించారు. ఆ 10 ఏళ్లలో రూ. 200 కోట్లు ఇచ్చామని చెప్తున్నది ఇందులో భాగంగానే. ఆ 10 ఏళ్లు నా బిడ్డలకు సమాన వాటా ఉందని గుర్తిస్తూ.. కంపెనీలోని డివిడెండ్‌లో సగం వాటా నాకు ఇవ్వడమే ఈ రూ. 200 కోట్లు. వాళ్లు చేసింది ఉపకారం కాదు. ప్రేమతో ఇచ్చింది అంతకంటే కాదు. నాకు సమాన వాటా ఉంది కాబట్టి డివిడెండ్‌లో సగం వాటా ఇచ్చారు. అది కూడా అప్పుగా చూపించమన్నారు" అని లేఖలో వైఎస్ షర్మిల పేర్కొన్నారు.




ముంబయి: గత కొన్ని రోజులుగా మదుపర్లకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్న దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు .. నేడు మరోసారి భారీ నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ దాదాపు 800 పాయింట్లకు పైగా, నిఫ్టీ 300 పాయింట్ల చొప్పున నష్టపోయాయి. బలహీన త్రైమాసిక ఫలితాలు, ఎఫ్ఐఐల అమ్మకాలు భారీ నష్టాలకు కారణమవుతున్నాయి. మధ్యాహ్నం 12.50 గంటల సమయంలో సెన్సెక్స్ 768 పాయింట్ల నష్టంతో 79,296 వద్ద.. నిఫ్టీ 264 పాయింట్ల నష్టంతో 24,135 వద్ద కొనసాగుతున్నాయి. సెన్సెక్స్‌లో ఇండస్ ఇండ్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్టీపీసీ, ఎల్అండ్‌టీ, అదానీ పోర్ట్స్ షేర్లు ప్రధానంగా నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, సన్‌ఫార్మా, నెస్లే ఇండియా, యాక్సిస్ బ్యాంక్ షేర్లు స్వల్ప లాభాల్లో కదలాడుతున్నాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.7.15 లక్షలు క్షీణించి రూ.436 లక్షల కోట్లుగా ఉంది.

**కారణాలు ఇవే..** బలహీన త్రైమాసిక ఫలితాలు మదుపర్లను నిరాశపరుస్తున్నాయి. పెద్ద పెద్ద, ప్రధాన కంపెనీల త్రైమాసిక ఫలితాల్లో మెరుపులు లేకపోవడం సూచీల పతనానికి కారణమని అనలిస్టులు చెబుతున్నారు. గతేడాదితో పోలిస్తే లాభంలో 40 శాతం క్షీణత నమోదుచేసిన ఇండస్ ఇండ్ బ్యాంక్.. నేడు ఏకంగా 19 శాతం నష్టాల్లో ట్రేడవుతోంది. సెన్సెక్స్ 130 పాయింట్లు పడడంలో ఈ స్టాక్‌ది కీలక భూమిక. విదేశీ మదుపర్ల అమ్మకాలు కూడా మన సూచీలపై ఒత్తిడి పెంచుతున్నాయి. గత 19 సెషన్లుగా ఎఫ్ఐఐలు విక్రయదారులుగా కొనసాగుతున్నారు. ఈ ఏడాది ఎన్నడూ లేనిరీతిలో అమ్మకాలకు తెగబడుతున్నారు. గురువారం నాటి ట్రేడింగ్‌లో రూ.5,062 కోట్ల విలువైన షేర్లను వీరు విక్రయించగా.. డీఐఐలు రూ.3,620 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. త్వరలో జరగనున్న అమెరికా ఎన్నికల ప్రభావం కూడా మన మార్కెట్లపై కనిపిస్తోంది. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్‌ల మధ్య గట్టి పోటీ నెలకొన్నప్పటికీ.. ట్రంప్ వైపు మొగ్గు ఉందన్న అంచనాలు అమెరికాలో బాండ్ ఈల్డ్స్, డాలర్ బలపడడానికి కారణమవుతున్నాయని అనలిస్టులు చెబుతున్నారు.

# శారదా పీఠం అక్రమ నిర్మాణాల కూల్చివేతకు రంగం సిద్ధం

తిరుమల, అక్టోబర్ 25: శారదా పీఠం భవనాల కూల్చివేతకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వ ఆదేశాలతో శారదా పీఠం అక్రమ నిర్మాణాలు కూల్చేందుకు టీటీడీ నిర్ణయం తీసుకుంది. తిరుమలలో అక్రమ నిర్మాణాలు తొలగించాలని శారదా పీఠానికి టీటీడీ అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు.. తదనంతరం అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను టీటీడీ కూల్చివేయనుంది. టీటీడీ భూముల్లో నిబంధనలను అతిక్రమించి శారదా పీఠం నిర్మాణాలు చేశారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఈవోకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కాగా.. గత కొన్ని సంవత్సరాలుగా తిరుమలలో శారదా పీఠం అక్రమ నిర్మాణాలను చేపట్టింది. దాదాపు 20వేల చదరపు అడుగుల్లో శారదా పీఠం అక్రమ నిర్మాణాలు చేపట్టింది. 2007లో మొదటి సారి అక్రమ నిర్మాణాలను శారదా పీఠం చేపట్టింది. తర్వాత 2019 నుంచి కూడా ఆ నిర్మాణాలను కొనసాగిస్తూనే ఉంది. తిరుమలలో రోడ్డును కూడా ఆక్రమించి శారదా పీఠం మఠం నిర్వాహకులు భారీ భవనాలను నిర్మిస్తున్నారు. చెరువులను ఆక్రమించేసి మరీ నిర్మాణాలు చేపట్టారు. టీటీడీ అధికారుల లెక్కల ప్రకారం దాదాపు 20 వేల చదరపు అడుగుల్లో శారదా పీఠం అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు తెలుస్తోంది. గత ఏడాది డిసెంబర్‌లో టీటీడీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి ఉన్న పాలకమండలి ఈ అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తూ రూ.30 లక్షల జరిమానాను విధిస్తూ తీర్మానం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపించింది.

అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శారదా పీఠం అక్రమ నిర్మాణాలపై ఈవో సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపించారు. దీన్ని క్షుణ్ణంగా పరిశీలించిన దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి గత పాలకమండలి ఇచ్చిన ధృవీకరణను రద్దు చేసింది. అలాగే శారదా పీఠం చేపట్టిన అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని టీటీడీ ఈవోను దేవాదాయ శాఖ ఆదేశించింది. అయితే ఈ అక్రమ నిర్మాణాలకు సంబంధించిన కేసు కోర్టు పరిధిలో ఉండటంతో ఈ నిర్మాణాలను కూల్చివేసేందుకు ప్రస్తుతం టీటీడీకి కూడా అవకాశం లేకపోవడంతో భవనానికి సంబంధించి ఎక్కడెక్కడ అక్రమ నిర్మాణాలు జరిగిందన్న దానిపై టీటీడీ ఈవో మరికాసేపట్లో




అక్కడకు చేరుకుని పరిశీలించే అవకాశం ఉంది. అక్రమ నిర్మాణాలపై తొలి నుంచి తిరుపతి జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జ్ కిరణ్ రాయల పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే.

**ఇది శుభపరిణామం: కిరణ్...** అక్రమ నిర్మాణాలపై తొలి నుంచి తిరుపతి జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జ్ కిరణ్ రాయల పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కిరణ్ రాయల ఏబీఎన్‌తో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే శారదా పీఠం అక్రమాలకు సంబంధించి మంచి నిర్ణయం తీసుకుందని తెలిపారు. జగన్ మోహన్‌ను రెడ్డిని దత్త పుత్రుడి కన్నా ఎక్కువగా చూసుకున్న దొంగ స్వామి అనేక చోట్ల భక్తి పేరుతో కోట్లు కాజేశారని ఆరోపించారు. తిరుమలలోనూ 5వేల చదరపు అడుగుల భూమిలో శారదా పీఠానికి అక్రమంగా కట్టుకునేందుకు కేవలం 30 లక్షలు ఇవ్వాలని గత ప్రభుత్వం జీవో ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంకటేశ్వర స్వామి ఆస్తిని కాజేయాలని చూశారన్నారు.

ఈ విషయాన్ని సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. దీంతో వెంటనే అక్రమ కట్టడాలను కూల్చివేయాలని టీటీడీకి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం శుభపరిణామమన్నారు. ఈవో వెంటనే చర్యలు తీసుకుని కూల్చివేస్తే భవిష్యతులో అక్రమ కట్టడాలు కట్టేందుకు భయం పడే పరిస్థితి ఉంటుంది కిరణ్ రాయల వెల్లడించారు.

# బ్లాక్ డిజైన్ లో వైట్ మెరుపు మతి పోవాల్సిందే!

బాలీవుడ్ బ్యూటీ కరీనా కపూర్ ఖాన్ గ్లామర్ ఛామ్ గురించి చెప్పేదేముంది. 43 ఏళ్ల వయసులోనూ కరీనా కవ్వింపు పీక్స్ లోనే ఉంటుంది. టోన్డ్ బాడీ లుక్ లో ఎప్పటికప్పుడు సమ్ థింగ్ స్పెషల్ గా ఫోకస్ అవుతుంది. నవతరం నాయికలకు పోటీగా నిలుస్తుంది. జిమ్-యోగా వంటి ఫిట్ నెస్ చర్యలతో ఆఛామ్ ని కంటున్యూ చేయగల్గుతుంది. 40 ప్లస్ లోనూ ధగధగలాడిపోతుంది. నవ నాయికలకు సైతం నా ముందు తగ్గాల్సిందే అంటుంది. తాజాగా అమ్మడు మరోసారి తళుక్కున మెరిసింది. ఇదిగో ఇక్కడిలా బ్లాక్ డిజైన్ లో కరీనా పాల నురుగల సౌందర్యం తో మిరుమిట్లు గొలుపుతోంది.



వైట్ స్పాట్ లో కరీనా మరింత షైనింగ్ అవుతుంది. అమ్మడి మ్యాకప్, అలంకరణ, హెయిర్ స్టైల్ ప్రతీది మరింత అందంగా తీర్చి దిద్దాయి. వివిధ భంగిమల్లో కరీనా ఫోజులు చూస్తే అమ్మడు 40 ప్లస్ బ్యూటీనా అన్న సందేహం రావడం సహజం. ప్రస్తుతం ఈ ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి. కరీనా అందానికి యువత ఫిదా అవుతుంది. ఈ పిక్ పై కరీనా మార్క్ కొటేషన్ విసిరింది. క్షమించండి, నేను ఎంత అద్భుతంగా కనిపిస్తున్నానో? కానీ అది మీ మాటల్లో వినలేను అంటూ రాసుకొచ్చింది. నెటి జనులు కామెంట్ బాక్స్ లో పోస్టులతో మరింత సెన్సేషన్ చేస్తున్నారు. లుక్స్ గార్జియస్, స్టన్నింగ్ క్వీన్, బ్లాక్ బ్యూటీ క్వీన్ అంటూ పోస్టులు పెడుతున్నారు. ఇక కరీనా కెరీర్ సంగతి చూస్తే! బాలీవుడ్ కి ఎంత మంది భామలు దిగొచ్చినా అమ్మడికి పోటీ అనేదే లేదు. ఇటీవలే ది క్రూతో మరో భారీ విజయం ఖాతాలో వేసుకుంది. సినిమా మంచి లాభాలు తేవడంతో అదే కాంబినేషన్ మరో సినిమాకి సన్నాహాలు చేస్తోంది. అలాగే సింగం ఎగైన్ లోనూ కరీనా కీలక పాత్ర పోషిస్తుంది. కాఫ్ స్టోరీలో కరీనా మార్క్ పడుతుందని అంచనాలున్నాయి.

# బుట్టబొమ్మపై ఇంకా ఆశ చావలేదు!

టాలీవుడ్ లో అగ్ర హీరోలందరి సరసనా నటించింది పూజా హెగ్డే. ప్రభాస్, మహేష్, ఎన్టీఆర్, రామ్ చరణ్, నాగచైతన్య సహా పలువురు టాప్ స్టార్ల సరసన నటించింది. భారీ పారితోషికంతో పాటు, తన సిబ్బందికి వసతులు, పెద్ద జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో పూజా పై నెగెటివ్ టాక్ స్ప్రెడ్ అయింది. తనను పలువురు నిర్మాతలు సంప్రదించినా పారితోషికం సహా ఇతర వసతుల విషయంలో పూజా ఎక్కడా తగ్గలేదని కథనాలొచ్చాయి. డిమాండ్ ఉన్నంత కాలం అన్నిటినీ ఇచ్చారు కానీ, బ్యాక్ టు బ్యాక్ ఫ్లాపులొచ్చాక ఆ సీన్ కనిపించలేదు. దీనికి తోడు పెద్ద స్టార్లు సైతం తమ సినిమాల నుంచి పూజాను తప్పించాల్సి వచ్చింది. త్రివిక్రమ్, హరీష్ శంకర్ లాంటి దర్శకులు



పూజాను తమ సినిమాల నుంచి తప్పించారు. పవన్, మహేష్ లాంటి స్టార్ల సినిమాల్లో అవకాశాల్ని కోల్పోయింది. అదే సమయంలో తనను సంప్రదించిన దర్శకనిర్మాతలకు నో చెప్పిందని కూడా కథనాలొచ్చాయి. ప్రతిసారీ తన డిమాండ్లు వదులుకోకపోవడంతో ఇక దర్శకనిర్మాతలు కూడా లైట్ తీస్కున్నారు. సాయిధరమ్ తేజ్‌తో పూజా హెగ్డే తెలుగులో ఒక సినిమా చేసింది కానీ ఆ సినిమా ఆగిపోయింది. ఈ నటి టాలీవుడ్‌కి తిరిగి రావడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం ఆశ్చర్యపరిచింది. అయితే పూజా ఎలా ఉన్నా ఇక్కడ అందరి కళ్లకు ఇంకా బుట్టబొమ్మే. అల వైకుంఠపురములో పొడుగు కాళ్ల సుందరి రూపం ఇంకా అలానే అభిమానులకు గుర్తుండిపోయింది. అందుకే ఇంకా మన దర్శకనిర్మాతల్లోను ఆశ చావ లేదు. షాహిద్ కపూర్ దేవా సహా సూర్య భారీ చిత్రంతో పూజా బిజీగా ఉంది. తెలుగులో ఏ నిర్మాత ప్రయత్నాలు ఫలిస్తాయో వేచి చూడాలి.




# కిరణ్ అబ్బవరం 'క' ట్రైలర్.. చీకటి ఊర్లో ఓ రహస్యం




టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం.. ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే పలు చిత్రాలతో సినీ ప్రియులను మెప్పించిన ఆయన.. ఇప్పుడు తన ఫస్ట్ పాన్ ఇండియా మూవీ 'క' తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. సుజీత్, సందీప్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ కథానాయికలుగా నటిస్తున్నారు. భారీ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ గా పాన్ ఇండియా లెవెల్ లో రూపొందిన ఆ చిత్రం.. దీపావళి కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. ఇక ఫైనల్ గా ట్రైలర్ ను విడుదల చేశారు. తెలుగుతో పాటు తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో అక్టోబర్ 31వ తేదీన విడుదల కానుంది. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, రెండు సాంగ్స్.. ఓ రేంజ్ లో సినీ ప్రియులను అలరించాయి. కచ్చితంగా మూవీ చూడాలనేంతగా హైప్ క్రియేట్ చేశాయి. సినిమాపై అంచనాలు పెంచేశాయి. ఇప్పుడు మూవీ రిలీజ్ డేట్ దగ్గరపడుతున్న కొద్దీ మేకర్స్.. ప్రమోషన్స్ లో మరింత స్పీడ్ పెంచారు. శుక్రవారం ఉదయం ట్రైలర్ ను రిలీజ్ చేశారు. అతని ప్రపంచం ఆసక్తికరం.. అతని ప్రయాణం ఒక రహస్యం అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అంతకుముందు.. ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడలో జరిగిన ఈవెంట్ లో థియేట్రికల్ ట్రైలర్ ను ఆవిష్కరించారు. దేవ దేవ అంటూ ఓల్డ్ సాంగ్ తో ట్రైలర్ స్టార్ట్ అయింది. ఆ వెంటనే చిన్న యాక్షన్ సీక్వెన్స్ బిట్ తో ఒక్కసారిగా ఆసక్తి రేపింది. ఆ తర్వాత కొండల నడుమ 3 గంటలకే చీకటి పడే కృష్ణ గిరి గ్రామాన్ని మేకర్స్ పరిచయం చేశారు. అందులో పోస్ట్ మ్యాన్ గా ఉద్యోగంలో అభినయ వాసుదేవ్ (కిరణ్ అబ్బవరం) చేరుతారు. అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో ప్రేమలో పడతారు. ఉత్తరాలు పంచే క్రమంలో అభిషేక్ పేరుతో వచ్చిన లెటర్ హీరో జీవితాన్ని మలుపు తిప్పుతుంది. ఆ తర్వాత లెటర్ లో ఏముందో చెప్పమని ముసుగు వేసుకున్న ఓ వ్యక్తి.. వాసుదేవ్ ను బెదిరిస్తాడు. అసలు ఆ ఉత్తరంలో ఏముంది? హీరోను ఓ గ్యాంగ్ ఎందుకు బెదిరిస్తున్నారు? దాని వెనుక ఉన్న కారణం ఏంటి? సినిమాలో మరో మెయిన్ ట్విస్ట్ ఏంటి?.. ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో క సినిమా ట్రైలర్ ట్రెండ్ అవుతోంది. మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అని అంతా చెబుతున్నారు. అంచనాలు ఆకాశాన్ని తాకేలా చేస్తుందని అంటున్నారు. ఫుల్ ఇంట్రెస్ట్ క్రియేట్ చేసిందని కామెంట్లు పెడుతున్నారు. ముఖ్యంగా కిరణ్ అబ్బవరం యాక్షన్ సన్నివేశాల్లో తన ప్రతిభను చాటుకున్నారు. తన నేచురల్ యాక్టింగ్ తో అలరించారు. డైలాగ్స్ తో మెప్పించారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ అంకితభావం ప్రతి ఫ్రేమ్‌లో కూడా కనిపిస్తుంది. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. సామ్ సీఎస్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అదిరిపోయింది. మంచి కంటెంట్ తో మూవీ రాబోతున్నట్లు మేకర్స్.. ట్రైలర్ ద్వారా పూర్తి క్లారిటీ ఇచ్చారు. చింతా గోపాలకృష్ణారెడ్డి ప్రొడక్షన్ వాల్యూస్ రిచ్ గా ఉన్నాయి. మరి కిరణ్ అబ్బవరం 'క' మూవీ ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో వేచి చూడాలి.


# తండేల్ టీమ్ తప్పుగా ఆలోచిస్తుందా?



టాలీవుడ్ యంగ్ హీరో నాగచైతన్య.. ప్రస్తుతం తండేల్ మూవీలో నటిస్తున్న విషయం తెలిసిందే. కార్తికేయ-2 సినిమాకు గాను ఇటీవల నేషనల్ అవార్డు అందుకున్న చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. ఉత్తరాంధ్రకు చెందిన కొందరు మత్స్యకారుల జీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. అలాగే ఇందులో మంచి ప్రేమ కథ కూడా హైలెట్ కానుంది. గీతా ఆర్ట్స్ 2 బ్యానర్ పై ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. నేచురల్ బ్యూటీ సాయి పల్లవి హీరోయిన్ గా నటిస్తున్నారు. లవ్ స్టోరీ మూవీ తర్వాత మరోసారి చైతూ, సాయి పల్లవి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం మేకర్స్ శరవేగంగా తండేల్ షూటింగ్ ను కంప్లీట్ చేస్తున్నారు. త్వరలోనే గుమ్మడికాయ కొట్టనున్నారు. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ ద్వారా సినిమాపై ఆడియన్స్ లో వేరే లెవెల్ బజ్ క్రియేట్ అయింది. కచ్చితంగా మూవీ మంచి హిట్ అవుతుందని ఎప్పుడో ఫిక్స్ అయిపోయారు. అయితే తండేల్ రిలీజ్ ఎప్పుడనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 20వ తేదీన రిలీజ్ అవుతుందని ఎప్పటి నుంచో టాక్ వినిపిస్తోంది. గేమ్ ఛేంజర్ కూడా పోస్ట్ పోన్ అవ్వడంతో అప్పుడే రిలీజ్ అని అంతా అనుకున్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అనౌన్స్మెంట్ రాలేదు. అప్పటికి సెన్సార్ పూర్తి అయ్యే ఛాన్స్ లేదని.. అందుకే సంక్రాంతికి తండేల్ ను రిలీజ్ చేయనున్నారని కొద్దిరోజులుగా సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. దీంతో సినీ ప్రియులు ఖుషీ అయ్యారు. ఎందుకంటే సంక్రాంతికి వచ్చే సినిమాలపై కచ్చితంగా అందరి ఫోకస్ ఉంటుంది. సినీ ప్రియులంతా థియేటర్లకు తరలివెళ్తారు. దానికి తోడు మిగతా సినిమాలతో పోలిస్తే.. తండేల్ పై ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ అయింది. కాబట్టి సంక్రాంతికి తండేల్ రావడం కరెక్టని అంతా అనుకున్నారు. ఇప్పటికే పొంగల్ బరిలో రావాలని ఫిక్స్ అయిన స్టార్ హీరో రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ పై అనుకున్న స్థాయిలో ఆడియన్స్ లో బజ్ లేదని చెప్పాలి. బాలయ్య 109 మూవీ వస్తున్నా.. సంక్రాంతికి అలాంటి మాస్ సినిమా ఉండాల్సిందే. వెంకటేష్, అనిల్ రావిపూడి ప్రాజెక్ట్ పోస్ట్ పోన్ అవుతుందని వార్తలు వస్తున్నాయి. దానిపైన కూడా ఇప్పటివరకు పెద్దగా హైప్ లేదు. ఒకవేళ రిలీజ్ అయినా తండేల్ కు ఎలాంటి ఢోకా లేదు. కాబట్టి తండేల్.. సంక్రాంతికి రిలీజ్ అయితే తిరుగలేదని అంతా భావిస్తున్నారు. కానీ మేకర్స్ ఇంకా అనౌన్స్ చేయడం లేదు. అదే సమయంలో నెట్టింట ఇప్పుడు మరో వార్త చక్కర్లు కొడుతోంది. పొంగల్ డేట్ ను తండేల్ మేకర్స్ పక్కన పెట్టారని తెలుస్తోంది. రిపబ్లిక్ డే లేదా వాలెంటైన్స్ డే కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ ఆలోచిస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. దీంతో నెటిజన్లు స్పందిస్తున్నారు. తండేల్ టీమ్ తప్పుగా ఆలోచిస్తుందని చెబుతున్నారు. సంక్రాంతికి మించిన బెస్ట్ సీజన్ ఇంకొకటి లేదుగా అని అంటున్నారు. మంచి బజ్ ఉన్న తండేల్ మూవీ సంక్రాంతికే రావాలని కామెంట్లు పెడుతున్నారు. పొంగల్ సీజన్ ను మిస్ చేసుకోవడం కరెక్ట్ కాదని అంటున్నారు. తండేల్ కు మంచి వైబ్స్ ఉన్నాయని, అందుకే సరైన నిర్ణయం తీసుకోవాలని మేకర్స్ కు సూచిస్తున్నారు. మరి తండేల్ మేకర్స్ ఏం చేస్తారో వేచి చూడాలి.

# ఈ సందేహాలపై కియారా క్లారిటీ ఇచ్చేసింది!

మూంజ్య, స్త్రీ-2 లాంటి భారీ విజయాలతో మడాక్ ఫిల్మ్స్ బాలీవుడ్ లో సంచలన నిర్మాణ సంస్థగా మారిపోయింది. ఈ రెండు విజయాలతో కంటెంట్ బేస్ట్ చిత్రాలు నిర్మించడంలో మడాక్ యూనిక్ సంస్థగా హైలైట్ అయింది. దీంతో ఇప్పుడు హీరోయిన్ల అందరి చూపు ఆసంస్థపైనే పండింది. సదరు నిర్మాణ సంస్థలో ఛాన్స్ వస్తే ముందుగా ఎస్ చెప్పిన తర్వాతే స్టోరీ వినాలని డిసైడ్ అయిపోతున్నారు. తాజాగా కియారా అద్వానీ ఇటీవల దినేష్ విజన్ కార్యాలయంలో కనిపించడం ఆసక్తికరంగా మారింది. దీంతో ఇది ఫ్రెండ్లీ మీట్ నా? లేక ప్రాజెక్ట్ కోసం ఇలా భేటీ అయ్యారా? అన్న డిస్కషన్ నెట్టింట సాగింది. అయితే తాజాగా ఈ సందేహాలపై కియారా క్లారిటీ ఇచ్చేసింది. ఇద్దరు కలిసి ఒక ప్రాజెక్ట్ చేయాలనుకుంటున్నట్లు తెలిపింది. ఓ కొత్త ఫాంటసీ



సినిమా కోసం ఇద్దరి మధ్య చర్చలు జరిగినట్లు స్పష్టం చేసింది. అయితే ఇది సూపర్ నేచురల్ యూనివర్స్‌లో భాగం కాదని సహకార ప్రాజెక్ట్ చెప్పుకొచ్చింది. స్త్రీ-2 రిలీజ్ కంటే ముందుగానే ఇరువురి మధ్య ఈ రకమైన చర్చలు జరుగుతున్నట్లు అంతర్గత వర్గాలు పేర్కొన్నాయి. ఈ చిత్రం భిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతుంది. ఇది ఓ కొత్త ఫ్రాంచైజీకి నాంది పలికేలా ఉంటుందిట. అతీంద్రీయ అంశాలతో పాటు ఫాంటసీ కామెడీని మిళితం చేసిన కాన్సెప్ట్ అని సమాచారం. స్క్రిప్ట్ సహా అన్ని పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది చిత్రాన్ని పట్టాలెక్కించాలని ప్లాన్ చేస్తున్నారుఏట. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందంటున్నారు. ప్రస్తుతం కియారా నటిగా బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తో గేమ్ ఛేంజర్ లో నటిస్తోంది. చరణ్ తో చేస్తోన్న రెండవ చిత్రమిది. అంతకు ముందు వినయ విధేయ రామలో నటించింది. ఆ సినిమా ఫ్లాప్ అయింది. అయినా ఫ్లాప్ తో సంబంధం లేకుండా శంకర్ ఆమెని తీసుకున్నాడు. అలాగే యశ్ రాజ్ ఫిలింస్ లో స్పై యూనివర్స్‌లో భాగమైన వార్ 2లోనూ కియారా నటిస్తోంది.

# సమంత డిమాండ్ పై త్వరలోనే స్పందన?

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో గతంలో వేసిన సబ్ కమిటీ నివేదికను విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సమంత కోరిన సంగతి తెలిసిందే. మాలీవుడ్ లో జస్టిస్ హేమ కమిటీ నివేదిక దేశ వ్యాప్తంగా సంచలనమైన వేళ సమంత ఈ డిమాండ్ ని తెరపైకి తెచ్చింది. ఇండస్ట్రీలో మహిళలపై జరుగుతోన్న లైంగిక దాడుల్ని అరికట్టాలంటే ప్రభుత్వం ఆధ్వర్యంలో కమిటీలు వేసిన ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు నటీమణులు డిమాండ్ చేసారు. మరి సమంత డిమాండ్ పై రేవంత్ సర్కార్ నివేదిక రిలీజ్ కి రెడీ అవుతుందా? ఇండస్ట్రీలో రేవంత్ మార్క్ రూలింగ్ హైలైట్ అవ్వాలంటే ఇదే సరైన సమయంగా భావిస్తున్నారా? ఇండస్ట్రీపై కొరడా ఝుళిపిం చడానికి రెడీ అవుతున్నారా? అంటే అవుననే విశ్వసనీయ సమాచారం అందుతోంది. సమంత డిమాండ్ అధికారుల దృష్టి కి వెళ్లడంతో విషయాన్ని సీఎం రేవంత్ చెవిన వేసినట్లు రాజకీయ వర్గాల్లో గుస గుస మొదలైంది. అప్పటి టీఆర్ ఎస్ ప్రభుత్వం వేసిన కమిటీ ఇండస్ట్రీలో ఎలాంటి పురోగతి సాధించిందో తెలియాలంటే సబ్ కమిటీ నివేదకను అధికారికంగా రిలీజ్ చేయకపోయినా లోగుట్టుగా



దాని సంగతేంటో తేల్చాలని ఆయా పార్టీ వర్గాల్లో చర్చకు దారి తీస్తోందిట. అయితే ఇది ఎంతో సున్నితమైన అంశం. ఇలాంటి నివేదికలు చాలా విషయాల్ని పరిగణలోకి తీసుకుని రిలీజ్ చేస్తుంటారు. కన్నడలో హేమ కమిటీ లాంటిది రావాలని కొంత మంది నటీమణులు డిమాండ్ చేయగా పరిశ్రమ అలాంటి కమిటీలు అవసరం లేదని భావించింది. గతంలో జరిగిన విషయాలకు..మాలీవుడ్ కమిటీ నివేదికకు సంబంధం ఏంటనే అంశాన్ని లేవనెత్తారు. మరి టాలీవుడ్ లో ఇలాంటి అంశం తెరపైకి వస్తుందా? లేదా? సమంత డిమాండ్ మేరకు సబ్ కమిటీ నివేదికను రిలీజ్ చేస్తారా? అన్నది చూడాలి. ఇండస్ట్రీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి కాస్త నెగిటివ్ గానే ఉన్నారనే ప్రచారంలో ఉంది. గద్దర్ అవార్డ్ లపై ఇండస్ట్రీ నుంచి సానుకూలంగా స్పందన రాకపో వడంతో రేవంత్ అసంతృప్తిని వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అలాగే చిత్ర పరిశ్రమకు చెందిన అక్కినేని నాగార్జున ఎన్ -కన్వెన్షన్ ని రేవంత్ సర్కార్ అక్రమ కట్టడంగా కూల్చి వేసిన ఉదంతం పలు సందేహాలకు తావిస్తోంది. మరి ఇలాంటి సమయంలో సమంత డిమాండ్ చేసిన నివేదిక రేవంత్ ప్రభుత్వం రిలీజ్ చేస్తే అతి పెద్ద సంచలనమే అవుతుంది.




## కేటీఆర్ పరువు నష్టం కేసులో మంత్రి సురేఖకు షాక్..

హైదరాబాద్, అక్టోబర్ 25: కొండా సురేఖ తనపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన రూ. 100 కోట్ల పరువు నష్టం కేసులో కోర్టు మంత్రి కొండా సురేఖకు మొట్టికాయలు వేసింది. ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయంటూ మండిపడింది. ఓ బాధ్యత గల మహిళ మంత్రి ఇలాంటి కామెంట్స్ చేయటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని పేర్కొంది. కేటీఆర్ పై కొండా సురేఖ వ్యాఖ్యలను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు సీరియస్‌గా పరిగణించింది. భవిష్యత్ లో ఇంకెప్పుడూ ఇలాంటి అడ్డగోలు వ్యాఖ్యలను కేటీఆర్ పై చేయవద్దని కొండాను సురేఖను ఆదేశించింది. అత్యంత జుగుప్సాకరంగా ఉన్న ఆ వ్యాఖ్యలను మీడియా, సోషల్ మీడియా, వెబ్ సైట్లు, అన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. యూట్యూబ్, ఫేస్ బుక్, గూగుల్ సంస్థలకు కూడా ఈ వ్యాఖ్యలు ఉన్న వీడియోలను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. కొండా సురేఖ వ్యాఖ్యలను ప్రసారం చేసిన, కథనాలు ప్రచురించిన మీడియా సంస్థలకు కూడా కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ కామెంట్లకు సంబంధించిన అన్ని కథనాలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని ఆయా సంస్థలను కోరింది. కొండా సురేఖ వ్యాఖ్యలు సమాజంలో చెడు ప్రభావాన్ని చూపుతాయని ఆమె వ్యాఖ్యలకు సంబంధించిన అన్ని కథనాలు, వీడియోలు పబ్లిక్ డొమైన్ లో ఉండవద్దని కోర్టు తెలిపింది.

**దేశంలో ఇదే మొదటి సారి..** పరువు నష్టం కేసుకు సంబంధించిన ఓ కేసులో మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై కోర్టు ఇంత ఆగ్రహం వ్యక్తం చేయటం ఇదే తొలిసారని బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొంటున్నారు. గతంలోనూ కొండా సురేఖ ఇలాంటి వ్యాఖ్యలు చేశారని.. ఎన్నికల సంఘం ఈ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిందన్నారు. ఆయనప్పటికీ మంత్రి కొండా సురేఖలో ఎలాంటి మార్పు రాలేదని విమర్శిస్తున్నారు. తన వ్యక్తిత్వ హననం చేసే విధంగా చేసే ఏ ఆరోపణలను సహించేది లేదని ఇప్పటికే కేటీఆర్ స్పష్టం చేశారు. ఇకపై తన గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారికి ఆయన ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. కేసులో కోర్టు తాజా కామెంట్లతో కేటీఆర్ కు బలం చేకూరినట్లైంది.




హైదరాబాద్: యుద్ధ ప్రాతిపదికన మెట్రో విస్తరణ పనులు చేపడుతున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. తాను హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగారని.. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరాల్లో ఒకటిగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

నరెడ్కో ప్రాపర్టీ షోకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. "తెలంగాణ ప్రగతిలో నరెడ్కో ఒక భాగం. మా ప్రభుత్వం నరెడ్కోకు అండగా ఉంటుంది. గతంలో ఉన్న అనుమతులను మా ప్రభుత్వం రద్దు చేయదు. క్రెడాయ్, ట్రెడ్కో, నరెడ్కో కలిసి ఒక కమిటీ ఏర్పాటు చేయండి. నెలకు ఒకసారైనా మీతో మాట్లాడి మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఓఆర్ఆర్ నిర్మించింది. ఇప్పుడు ఆర్ఆర్ఆర్ నిర్మిస్తున్నాం.
యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతున్నాం. ప్రపంచ స్థాయి స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ తీసుకొస్తున్నాం. నగరంలో మౌలికసదుపాయాల కల్పన కోసం రూ.10వేల కోట్లు కేటాయించాం. మా ప్రభుత్వం వ్యాపార రంగానికి అండగా ఉంటుంది. మాది ప్రజాస్వామ్య ప్రభుత్వం. గత ప్రభుత్వాల మాదిరి కాదు" అని ఉత్తమ్ అన్నారు.




హైదరాబాద్, అక్టోబర్ 25: మూసీ ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తున్న వారు మూడు నెలల పాటు మూసీ పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉంటే ప్రాజెక్టును విరమించుకుంటానంటూ ముఖ్యమంత్రి రేవంత్ చేసిన సవాల్‌ను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మూసీ ప్రాంతాల్లో పేదల ఇళ్ల కూల్చివేతలకు వ్యతిరేకంగా ఇందిరాపార్క్ వద్ద బీజేపీ మహాధర్నాను చేపట్టింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... "సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నాం.. మూసీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజల కోసం వారి ఇళ్లలో నివాసం ఉండేందుకు మేము సిద్ధం" అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు పూర్తి కావస్తోందని.. నిరుపేదలకు ఇచ్చేందుకు ఏ ఇంటికి రేవంత్ సర్కార్ శంకుస్థాపన చేయలేదని, భూమి పూజ చేయలేదని విమర్శించారు. కొత్తగా ఇవ్వకపోగా ఏండ్లుగా నివసిస్తున్న నిరుపేదల ఇండ్లను కూలుస్తోందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని.. ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలను గారడీలుగా మార్చి మసి పూసి మారేడుకాయ చేశారన్నారు. ప్రజలను సోనియా, రాహుల్, రేవంత్ మభ్యపెట్టారని విమర్శించారు.

**రేవంత్‌కు కలపడ్డట్టుంది...** బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వాళు ౢ కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేశారని.. ప్రజల ఇండ్లకు మార్కింగ్ వేసి ప్రజలను భయపెట్టారని తెలిపారు. కేసీఆర్ దారిలోనే రేవంత్ వెళ్తున్నారని ఆరోపించారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని.. కానీ పేదల ఇండ్లను కూలిస్తే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు. మూసీకి ఇరువైపులా రిటైనింగ్ వాల్ సుందరీకరణ చేసుకోవాలన్నారు. "మూసీ బాధితులు ఎవరైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్‌కు మూసీ పక్కన ఉండలేకపోతున్నామని చెప్పారా.. మా ఇండ్లు కూల్చమన్నారా. రేవంత్‌కు కలపడినట్టు ఉంది. అయితే ఆ కల లక్షన్నర కోట్లపైన అయి ఉండొచ్చు.. కానీ పేద ప్రజలకు మంచి చేయాలనేది మాత్రం కాదు" అంటూ వ్యాఖ్యలు చేశారు.

## ఫార్మా విలేజ్ ప్రజాభిప్రాయ సేకరణలో ఉద్రిక్తత

వికారాబాద్: ఫార్మా విలేజ్ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దుద్యాల మండలం రోటిబండతండాలో ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా స్థానికులు ధర్నా చేపట్టారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడి కారుపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. ఫార్మా విలేజ్‌ను వ్యతిరేకిస్తూ పలువురు రైతులు ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. దీంతో పోలీసులు వీరిని అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ భవనం వద్ద పోలీసులు, నిరసనకారుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పోలీసుల లాఠీఛార్జిలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల ఆందోళనతో ఫార్మా విలేజ్ ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా పడింది.



## పేదింటి ఆడబిడ్డ ఎంబీబీఎస్ చదువుకు అండగా నిలిచిన మర్రి జనార్దన్ రెడ్డి

నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మరోసారి దాతృత్వాన్ని చాటుకున్నాడు. ఆర్థిక పరిస్థితులతో చదువుకు దూరమైన పేదింటి ఆడబిడ్డకు ఆర్థిక చేయూతనందించి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే..నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జెట్ప్రోలు గ్రామానికి చెందిన ప్రహర్ష అనే యువతికి నారాయణపేట్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చింది. అయితే ఆర్థిక ఇబ్బందులు వల్ల చదివించలేక పోతుందని యువతి తల్లిదండ్రులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీంతో ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి స్పందించారు. వెంటనే వారి వివరాలు తెలుసుకొని తన MJR చారిట బుల్ ట్రస్టు ద్వారా అ అమ్మాయి ఎంబీబీఎస్ చదవడానికి మొదటి సంవత్సరం ఫీజు 75 వేలు రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. మిగతా మూడు సంవత్సరాల ఫీజు తన ట్రస్ట్ ద్వారా చెల్లిస్తానని ఆయన బరోసా



ఇచ్చారు. పేదింటి ఆడబిడ్డ చదువుకు అండగా నిలిచిన మర్రి జనార్దన్ రెడ్డిని పలువురు అభినందించారు.



## జర్మనీ వీసాలు 20వేలు నుంచి 90 వేలకు పెంపు.. ప్రధాని మోదీ వెల్లడి

దిల్లీ: నైపుణ్యం కలిగిన భారత శ్రామిక శక్తి కోసం వీసాల సంఖ్యను పెంచేందుకు జర్మనీ నిర్ణయించింది. ఈ సంఖ్యను 20వేల నుంచి 90వేలకు పెంచిందని ప్రధాని మోదీ తాజాగా వెల్లడించారు. 18వ ఆసియా పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్‌లో ప్రధాని మాట్లాడుతూ.. రాబోయే 25ఏళ్లకు వికసిత్ భారత్ కోసం రోడ్‌మ్యాప్ రూపొందించామని ఈ సందర్భంగా తెలిపారు. "ఫోకస్ ఆన్ ఇండియా పేరిట జర్మనీ క్యాబినెట్ ఒక పత్రాన్ని విడుదల చేయడం ఆనందంగా ఉంది. నైపుణ్యం కలిగిన భారతీయ ఉద్యోగులకు వీసాల సంఖ్యను 20 వేల నుంచి 90 వేలకు పెంచాలని జర్మనీ నిర్ణయించింది. భారత శ్రామిక శక్తిపై జర్మనీ ఉంచిన విశ్వాసం అద్భుతం. ఈ నిర్ణయం ఆ దేశ వృద్ధికి దోహదం చేస్తుంది. భారత్ తయారీ కేంద్రంగా మారింది. భారత్, జర్మనీ భాగస్వామ్యం కేవలం లావాదేవీలకే పరిమితం కాదు.. రెండూ బలమైన ప్రజాస్వామిక పరివర్తన భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. ప్రపంచం ఉద్రిక్తతలు, సంఘర్షణ, అనిశ్చితితో ఉన్న సమయంలో ఇరు దేశాల వ్యూహాత్మక బంధం బలోపేతమవుతోంది. యుద్ధం సమస్యలను పరిష్కరించలేదు.. శాంతి కోసం సాధ్యమైనంత సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగానే ఉంటుంది" ప్రధాని మోదీ అన్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా గురువారం జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ షోల్జ్ భారత్‌కు వచ్చారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో సమావేశం నిర్వహించుకుంటున్నామని వ్యాఖ్యానించారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థ అని కొనియాడారు.




## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న తెలంగాణ గవర్నర్

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దర్శించుకున్నారు. ప్రధానాలయంలోని ధ్రువ మూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఆలయానికి అనుబంధంగా ఉన్న ఆంజనేయస్వామి, లక్ష్మీ తాయారు అమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం పలికారు. గవర్నర్‌కు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ ఈవో రమాదేవి అందజేశారు. అంతకుముందు గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ స్వాగతం పలికారు. గవర్నర్‌తో పాటు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్వామివారిని దర్శించుకున్నారు.

## ఇంతకంటే కాస్ట్‌లీ ప్రాజెక్టు.. కాస్ట్ లీ స్కామ్ ఎక్కడా లేదేమో

హైదరాబాద్, అక్టోబర్ 25: "మొన్నటి వరకు హైడ్రా జరిగింది.. ఆ బాధితుల్లో జేసీబీ, బుల్డోజర్లు అనే భయం కనిపించాయి. ఇప్పుడు మూసీ బాధితులను చూస్తుంటే వారిలో బీజేపీ ఉందనే భరోసా కనిపిస్తోంది. కాంగ్రెస్ విధానాలపై ప్రజలకు అండగా ఉండి బరాబర్ కొట్లాడుతాం" అని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. మూసీ ప్రాంతాల్లో పేదల ఇళ్ల కూల్చివేతలకు వ్యతిరేకంగా ఇందిరాపార్క్ వద్ద బీజేపీ మహాధర్నాలో బండి సంజయ్ పాల్గొని ప్రసంగించారు. మూసీ ఒకప్పుడు మంచినీళ్లు అందించిందని.. ఇప్పుడు విషం కక్కుతోందన్నారు. "నేను పాదయాత్ర చేసినప్పుడు కళ్లారా చూశా. మూసీ సర్వ నాశనం కావడానికి కారణం కాంగ్రెస్. పరిశ్రమలకు అడ్డగోలుగా పెట్టుకోవాలని చెప్పి అనుమతి ఇచ్చింది వారు కాదా. మొన్న రేవంత్ లండన్ పోయి ఒక నది చూశాడు.. అది చూసే లక్షన్నర కోట్లు అన్నాడు. నిన్న సియోల్‌కు నేతలను పంపాడు.. వాళు ౢ ఎంత చెప్తారో మరి. రేవంత్.. ముందు మంత్రులను మూసీ పరివాహక ప్రాంతాల్లో తిరగమను. అలా వెళ్తే ప్రజలు వాళ్ళను గంప కింద కుమ్ముతారనే భయం రేవంత్‌కు ఉంది. రేవంత్ మొన్న మూసీ సుందరీకరణ అని ఒకసారి అంటాడు.. పునరుజ్జీవనం అని ఒకసారి అంటాడు.. ఏంటో ఆయనకే క్లారిటీ లేదు. లక్షన్నర ఖర్చు అన్నాడు.. మళ్ళీ నేను అనలేదు అంటున్నాడు. మూసీ ప్రక్షాళన పేదల కోసం కాదు.. ఇదంతా కాంగ్రెస్ అధినాయకురాలు సోనియా అల్లుడి కోసమే. బీఆర్ఎస్ నేతలకు దీనిపై మాట్లాడే హక్కు లేదు.. వారిది నోరా.. మోరా" అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆరు గ్యారెంటీలను డైవర్ట్ చేసేందుకే హైడ్రా, మూసీ అంటూ డ్రామాలు ఆడుతున్నారని



మండిపడ్డారు. కాంగ్రెస్ ఒక డ్రామా కంపెనీ అని.. ఆ పార్టీలో ఎవరికీ వారు సీఎంలంటూ సెటైర్ విసిరారు. సబర్మతి ఖర్చు రూ.7 వేల కోట్లు అని, నమామి గంగ ఖర్చు రూ.40 వేల కోట్లు అయితే మూసీకి లక్షన్నర కోట్లా అని ప్రశ్నించారు. ఒక్క కిలోమీటర్‌కు 2 వేల కోట్లా అని నిలదీశారు. ఇంతకంటే కాస్ట్‌లీ ప్రాజెక్టు.. కాస్ట్ లీ స్కామ్ ప్రపంచంలో లేదన్నారు. దోషులు ప్రజలు కాదు.. అక్రమంగా కూల్చుతున్న ప్రభుత్వమే దోషి అని అన్నారు. "మాకు కేసులు, లాఠీలు కొత్త కాదు. ఎన్ని జైళ్లు కట్టుకుంటావో కట్టుకో రేవంత్.. మేము కొట్లాడేందుకు సిద్ధం. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు రోడ్లపై తిరగకుండా చేస్తాం. మీ అల్లుడికి పైసలు కావాలంటే కాంగ్రెస్ నేతలు దోచుకున్న వాటిలో నుంచి ఇవ్వండి.. పేదల వద్ద నుంచి లాక్కుంటామంటే ఊరుకోం" అంటూ బండి సంజయ్ హెచ్చరించారు.

## పొంగులేటి బాంబులు తుస్సే.. : కేటీఆర్



సిరిసిల్ల, అక్టోబర్ 25: బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన నేతల అరెస్టులు తప్పవని, త్వరలోనే బాంబులు పేలతాయంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎలాంటి బాంబులకు భయపడేది లేదని తేల్చిచెప్పారు. చంద్రబాబు, వైఎస్ఆర్ వంటి వారితోనే పోరాటం చేశామని.. మీరో లెక్కా అంటూ విరుచుకుపడ్డారు. పొంగులేటి బాంబులు తుస్సే అంటూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. "ఏం పీక్కుంటారో పీక్కోండి.. నీ బాంబులకు భయపడలేదు. కేసులకు భయపడేది లేదు. మేం ఒరిజినల్ బాంబులకే భయపడలేదు. దొంగ కేసులు పెడితే పెట్టుకో. నీ ఈడీ కేసులు, మోడీ కాళ్ళు మొక్కిన బాంబుల గురించి చెప్పు. చంద్రబాబు, వైస్సార్‌తోనే కొట్లాడినం.. ఈ చిట్టి నాయుడు ఓ లెక్కనా. అడ్డమైన కేసులు పెట్టి జైలుకు పంపితే పంపు.. ఆర్ఆర్ టాక్స్‌లపై మేం వచ్చాక లెక్క తెలుస్తాం. సీఎం రేవంత్ బామ్మర్ది, పొంగులేటి బాగోతాలు అన్నీ బయటకు తీస్తాం. చావుకు మేం భయపడం" అంటూ కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభం కాని పత్తి కొనుగోళ్లు..

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లాలో పత్తి కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో రైతులె ఇబ్బందులు పడుతున్నారు. తేమ పేరుతో అధికారులు కాలయాపన చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమ శాతం పరిగణలోకి తీసుకోకుండా సీసీఐ పత్తి కొనుగోలును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ రాజర్షి షా రైతులతో మాట్లాడే ప్రయత్నం చేశారు.

8 నుంచి 12% తేనే ఉంటేనే కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో మార్కెట్‌కు భారీగా తరలి వచ్చిన రైతులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. పంటలు పండించడం ఒక ఎత్తయితే చేతికొచ్చిన పంటను అమ్ముకోవడం మరో సమస్యగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గతంలో మాదిరిగా కొనుగోళ్లు చేపట్టాలని కోరుతున్నారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com